విలేకరులు కావలెను

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143



TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 153 | గురువారం 8.10. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


# దిల్లీలో ఉద్రిక్తత

## విపక్ష ఎంపీల ఆందోళన..

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సహా విపక్ష పార్టీల నేతలు చేపట్టిన ఆందోళనలతో దిల్లీ మరోసారి అట్టుడికింది. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు సహా విపక్ష ఎంపీలు తన నిరసన తెలిపేందుకు జంతర్ మంతర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించడంతో అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆంక్షల నేపథ్యంలో వీరందర్నీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ప్రియాంకా గాంధీ సహా పలువురు మహిళా నేతలు, కార్యకర్తలు నేలపైనే పడుకొని నిరసన తెలిపారు. దీంతో జంతర్‌మంతర్ సమీపంలో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.రాహుల్ గాంధీ సహా పలువురు ఎంపీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు బరఖాంబ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిరసన ప్రదేశం నుంచి రాహుల్‌ను బలవంతంగా తీసుకెళ్లి పోలీసులు బస్సులో ఎక్కించారు. ప్రియాంకా గాంధీని ఛత్రసాల పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంలో దిల్లీ పోలీసుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఎంపీలతో ప్రవర్తించే తీరు ఇదేనా? ఎంపీలను కొడతారా? ఈడ్చి పడేస్తారా?" అని ప్రశ్నించారు.మరోవైపు రాహుల్ గాంధీకి సంఘీభావం తెలిపేందుకు బరఖాంబ పీఎస్ వద్దకు వెళ్లిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళం ముఖ్యమంత్రి సతీశన్‌లను పోలీసులు అడ్డుకున్నారు. అక్కడికి కాంగ్రెస్ నేతలు భారీగా చేరుకొని ఆందోళన చేపట్టగా వారిని



పోలీసులు నిలువరించారు. దాదాపు రెండు గంటలపాటు రాహుల్‌ను పీఎస్‌లో ఉంచిన అనంతరం విడుదల చేశారు.

## సీఈసీ రాజీనామా చేసే వరకు పోరాడతాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ తెలంగాణ వాణి)

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిల్లీలో ప్రజాస్వామ్యయుతంగా చేపట్టిన ఆందోళనను అడ్డుకోవడం మోదీ, అమిత్ షా.. నిరంకుశత్వానికి నిదర్శనమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. అరెస్ట్ అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఉన్న రాహుల్, ప్రియాంకను కలిసేందుకు యత్నించిన రేవంత్‌రెడ్డి, కేరళ సీఎం వీడీ సతీశన్‌ను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల చర్యను రేవంత్ తీవ్ర స్థాయిలో తప్పుబట్టారు. "సర్‌ను తక్షణమే నిలిపివేయాలి. ప్రజల ఓటు హక్కును ఈసీ హరిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ ఓట్ల టార్గెట్‌గా కుట్ర జరుగుతోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాడతాం. ఎన్నికల్లో గెలవడానికి ఈడీ, సీబీఐని వాడేవారు. ఇప్పుడు ఈసీని ప్రయోగిస్తున్నారు" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు



## తెలంగాణ వాణి కథనాల ఎఫెక్ట్..

- మత్తు మాఫియాపై ఉక్కుపాదం!
- గంజాయి, అల్ప్రాజోలం, కల్తీకల్లు, గుడుంబాపై ప్రత్యేక నిఘా
- ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలకు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి దిశానిర్దేశం



**అక్టోబర్ 7 (తెలంగాణ వాణి స్పెషల్ రెస్పాండెంట్ టీఎన్ రమేష్):**

నిజామాబాద్ జిల్లాలో అక్రమ గంజాయి రవాణా, అల్ప్రాజోలం విక్రయాలు, కృత్రిమ కల్లు తయారీపై తెలంగాణ వాణి ప్రచురించిన వరుస కథనాల నేపథ్యంలో అధికార యంత్రాంగం స్పందించింది. మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మత్తు పదార్థాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను ఆయన పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో గుడుంబా, నాటుసారా విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటున్న గంజాయి విక్రయాలను అరికట్టేందుకు ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించాలని సూచించారు.

### సరఫరా మూలాలపై నిఘా

కల్తీకల్లు తయారీలో వినియోగిస్తున్న అల్ప్రాజోలం, డైజోఫామ్, క్లోరల్ హైడ్రేట్ వంటి పదార్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయో గుర్తించాలని సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. వాటి సరఫరాదారులు, సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులను ఉపేక్షించబోమని హెచ్చరించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ మత్తు పదార్థాలను రవాణా చేసే, విక్రయించే, వినియోగించే వారిపై నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. అవసరమైతే పోలీసు శాఖ సహకారంతో చర్యలు చేపట్టి నిజామాబాద్‌ను మత్తురహిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్ల పరిధిలో సిగరెట్లు, గుట్కా తదితరాల విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా రెవెన్యూ అధికారి గీత, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీధర్, సూపరింటెండెంట్ నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యానికి మచ్చ

- రాజకీయంగా ఎదుర్కోలేక కేంద్ర ప్రభుత్వం అరెస్టుల మార్గం
- చలో రాజ్‌భవన్" నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



హైదరాబాద్ తెలంగాణ వాణి)

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని వరుసగా రెండోసారి అరెస్టు చేయడాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) తీవ్రంగా ఖండిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దేశ ప్రధానమంత్రి తర్వాత అత్యున్నత గౌరవం ఇవ్వాల్సిన ప్రతిపక్ష నాయకుడి పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ చేసిన తప్పిదాలను ప్రజల ముందుకు తీసుకువచ్చినందుకే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను రాజకీయంగా ఎదుర్కోలేక కేంద్ర ప్రభుత్వం అరెస్టుల మార్గాన్ని ఎంచుకుందని విమర్శించారు. ఇండియా కూటమి నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ, - మిగతా 2 లో..

## ఉపాధి హామీకి 'అక్టోబర్' జోష్

- రోజుకు 2.54 లక్షల మందితో సరికొత్త రికార్డు
- గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంతగా అక్టోబర్‌లో
- రోజుకు 2.54 లక్షల మందికిపైగా హాజరు
- వేజ్ సీకర్ల సంఖ్య మరింత పెంచాలని మంత్రి సీతక్క ఆదేశం

## ఓటు.. సీటు చోరీ పేటెంట్ కాంగ్రెస్‌దే

- నెహ్రూను ప్రధాని చేయడమే తొలి ఓటు, సీటు చోరీ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు: బండి



## డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోను ప్రైవేటీకరించే ఆలోచనే లేదు: భట్టి

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే విద్యుత్ డిమాండ్ అత్యధిక స్థాయికి చేరిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క (దీష్ఘ్ఱ ఎఱనితీఖఝతీఝ) అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. "20 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నాం. కొందరు నేతలు తప్పుడు ప్రచారంతో ప్రజలను గందరగోళపంస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా.. అవసరాలకు తగ్గట్టు విద్యుత్ సరఫరా చేస్తున్నాం. డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోను ప్రైవేటీకరించే ఆలోచనే లేదు. విద్యుత్ సంస్థలను లిస్టెడ్ కంపెనీలుగా మార్చే ప్రతిపాదన లేదు. పదేళ్లు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు అలా మాట్లాడటం సరికాదు. విద్యుత్ సిబ్బందిని కించపరిచే విధంగా రాజకీయ నేతలు విమర్శలు చేస్తున్నారు. ఊహించుకుని మాట్లాడటం వల్ల రాష్ట్రానికే నష్టం. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల భారీగా విద్యుత్ డిమాండ్ పెరిగింది. యాదాద్రి పవర్ ప్లాంట్ పాపం ఎవరిది? ఒక పవర్ ప్లాంట్ పెట్టేముందు.. అవసరమైన కోల్ చూసుకుని పెడతారు. సింగరేణి నుంచి యాదాద్రికి గ్రేడ్ 9 కోల్ సప్లయ్ చేస్తామని చెప్పారు. బొగ్గు సరఫరాకు ఒప్పందం చేసుకుని సప్లయ్ చేయలేదు. మొదటి నుంచి కోల్ అలాట్‌మెంట్ లేకుండానే యాదాద్రి పవర్ ప్లాంట్ కట్టారు" అని భట్టి విక్రమార్క తెలిపారు.

సింగరేణి స్థలాల్లో మైనింగ్ చేయని ప్రదేశాల్లో నెహ్రూ హౌసింగ్ కాలనీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులు, కార్మికుల ఇళ్ల నిర్మాణం కోసం లేఅవుట్లు వేయనున్నారు. ఈ మేరకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి అధికారులను ఆదేశించారు. శిథిలమైన డి--టైప్ క్వార్టర్స్‌ను తొలగించి వాటిస్థానంలో కార్మికుల జీవన ప్రమాణాలు పెంచేవిధంగా అన్ని వసతులతో నూతన క్వార్టర్స్ నిర్మాణం చేసి నెహ్రూ పేరిట సింగరేణి



కాలనీలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు..

రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించిన భూముల్లో 5,774 ఎకరాలు తిరిగి రెవెన్యూ శాఖకు అప్పగించగా అందులో 4,500 ఎకరాలు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. మిగిలిన 1,250కిపైగా ఎకరాల్లో జీరో నంబర్ 76 ప్రకారంగా అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని నిర్ణయించారు. బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న దీర్ఘకాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాభవన్‌లో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని డిప్యూటీ సీఎం నిర్వహించారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామిలతోపాటు సింగరేణి పరిధిలోని ఎమ్మెల్యేలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## "యంగ్ ఇండియా" రయ్.. రయ్..

- ఊపందుకున్న పాఠశాలల నిర్మాణాలు
- రాష్ట్ర వ్యాప్తంగా 105 నియోజకవర్గాల్లో పాఠశాలలకు ప్రణాళిక
- 87 చోట్ల వివిధ దశల్లో పాఠశాలల పనులు
- నిర్మాణాలకు రూ. 1,144.85 కోట్ల నిధులు విడుదల

## దేశమే ధ్యాసగా.. ప్రజాసేవే శ్వాసగా..

ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రయాణం

- ఎన్ని సవాళ్లు ఎదురైనా మోదీ ఆశీర్వాదంతో తెలంగాణలో కాషాయ జెండా ఎగరేస్తాం
- ఏలేటి మహేశ్వర్ రెడ్డి

2 లో



TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక



# విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు



**భువనగిరి, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి విలేకరి):**
విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఎలక్ట్రిసిటీ కంజ్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెసల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) నిరంతరం అందుబాటులో ఉంటుందని ఫోరం చైర్‌పర్సన్ కే. సాయిబాబా తెలిపారు. భువనగిరి కిసాన్‌నగర్ విద్యుత్ కార్యాలయంలో నిర్వహించిన వినియోగదారుల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరా, మీటర్లు, బిల్లులు, కొత్త సర్వీసులు, పేరు, కేటగిరీ మార్పులు తదితర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వినియోగదారుల సంఘాల ప్రతినిధి కొడారి వెంకటేష్ కోరారు. లోఓల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు, రైతులకు విద్యుత్ సరఫరా, గృహజ్యోతి తదితర సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ మెంబర్ టెక్నికల్ వి. రమణమూర్తి, మెంబర్ ఫైనాన్స్ కే. శోభారాణి, కంజ్యూమర్ ఎఫైర్స్ మెంబర్ టి. కోటేశ్వరరావు, డివిజన్ ఇంజనీర్లు రవీందర్, వెంకటేశ్వర్లు, సుధీర్‌కుమార్, పద్మ, శ్రీకాంత్, బాలూనాయక్, ఫీర్యా, మోహన్, పట్టణ ఏఈ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సాతారంలో ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభం



**కోరుట్ల రూరల్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు కలిసి ప్రారంభించారు. గ్రామీణులకు ప్రాథమిక వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఉప కేంద్రం ద్వారా ఆరోగ్య పరీక్షలు, ప్రాథమిక చికిత్స, వైద్య సలహాలు అందుతాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలు సకాలంలో అందేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు. జువ్వాడి నర్సింగారావు మాట్లాడుతూ గ్రామీణుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో నరసింహారావు, డీఎంహెచ్ఓ సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, తహసీల్దార్, వైద్య సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ధర్మారం పీహెచ్‌సీలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



**ధర్మారం, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ సుష్మిత ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ పవిత్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయ దుస్తుల్లో పాటలు, నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పవిత్ర మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, ప్రకృతితో అనుబంధానికి ప్రతీక అన్నారు. రసాయన రంగులు లేకుండా సహజ పుష్పాలతో బతుకమ్మను తయారు చేసి ఆరోగ్యకరమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రావణ్‌కుమార్, సుష్మిత, రాజు, సుధాకర్‌రెడ్డి, సిబ్బంది జ్యోతి, శ్రీలత, అంజలి, విజయలలిత, నర్సింహారెడ్డి, జీవరాణి, జయ, దామోదర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈసీపై ఆరోపణలు ప్రజాస్వామ్యానికే ప్రమాదం: బండి సంజయ్



**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎన్నికల సంఘంపై నిరాధార ఆరోపణలు చేయడం, రాజ్యాంగ సంస్థలను బదనాం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. అర్హులకు ఓటు హక్కు కల్పించడంతోపాటు అనర్హులు, మరణించిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం ఈసీ బాధ్యతేనని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గీతాభవన్ చౌరస్తా నుంచి హౌసింగ్‌బోర్డు కాలనీ పడవ చౌరస్తా వరకు ‘సేవా జ్యోతి’ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ‘వికసిత్ భారత్ సంకల్ప సభ’లో బండి సంజయ్ మాట్లాడారు. ఈసీపై అభ్యంతరాలుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాలకు అండగా ప్రభుత్వం-మంత్రి అడ్లూరి

**ధర్మారం, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి )**
నందిమేడారం రిజర్వాయర్ సామర్థ్యం పెంపుతో తలెత్తిన చామనపల్లి గ్రామ ముంపు సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. నంది పంప్‌హౌస్‌లో నీటిమట్టం పెరగడంతో గ్రామంలోని ఇళ్లకు ముంపు ముప్పు ఏర్పడిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం చామనపల్లి గ్రామానికి చేరుకుని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ముంపు బాధితులు, గ్రామ ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సంబంధిత అధికారులతో కలిసి ముంపు పరిస్థితిని మంత్రి పరిశీలించారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో చామనపల్లి ముంపు సమస్యను ఏ నాయకుడు పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ముంపు బాధితులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మంత్రి తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా



అవసరమైన చర్యలు తీసుకుంటామని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు, ఉపసర్పంచ్ తీగుళ్ల కవిత సతీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రూప్లా నాయక్, నాయకులు చింతల ప్రదీప్ రెడ్డి, కొడారి హనుమయ్య, తహసిల్దార్ డి శ్రీనివాస్, దాగేటి ఉదయ్, అధికారులు, వివిధ గ్రామల సర్పంచులు నాయకులు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బైండ్ల శ్రీకాంత్ నియామకం

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 7 (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన బైండ్ల శ్రీకాంత్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగజెంగి నందయ్య. నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్ తక్షణమే బాధ్యతలు. స్వీకరించ నున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా అవకాశంకల్పించేందుకు సహకరి ంచిన టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావుకు శ్రీకాంత్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్



గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని శ్రీకాంత్ తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

## జమ్మికుంట కాటన్ మార్కెట్‌లో కొత్త పత్తికి రూ.8,600

### దళారులను ఆశ్రయించకుండా నేరుగా మార్కెట్‌కు రావాలి



**జమ్మికుంట, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట కాటన్ మార్కెట్ యార్డులో బుధవారం కొత్త పత్తి విక్రయాలు జోరుగా సాగాయి. రైతులు 32 ట్రాలీల్లో 158 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా, వేలంలో గరిష్టంగా క్వింటాలుకు రూ. 8,600 ధర లభించింది. మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న–సదానందం మాట్లాడుతూ రైతులు పత్తిని పూర్తిగా ఆరబెట్టి, శుభ్రపరిచి నేరుగా మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దన్నారు. ధర, తూకం విషయంలో సమస్యలు ఎదురైతే మార్కెట్ పాలకవర్గం దృష్టికి తీసుకురావాలని కోరారు. అడ్తి వ్యాపారులు రైతులకు పోటీ ధర కల్పించి, విక్రయించిన పత్తికి అదే రోజు నగదు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ఆర్. మల్లేశం, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్‌రెడ్డి, గౌరవ సభ్యులు శ్రీపతిరెడ్డి, రాజేశ్వరరావు, సదానందం, సురేష్, తిరుపతి, శ్రీనివాస్, మార్కెట్ సిబ్బంది, అడ్తి వ్యాపారులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ పరిమర్శించిన జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి



**కొమురవెల్లి అక్టోబర్.7(తెలంగాణ వాణి ప్రతినిధి)**
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని అయినాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ పబ్బోజు విజేందర్ కుమారుడు పబ్బోజు మురళి కార్తీక్ కి నిన్న అర్ధరాత్రి కుషాయిగూడలో రోడ్డు ప్రమాధం జరగగా సికింద్రాబాద్ యశోద అస్పత్రి లో చికిత్సపొందుతూ బుధవారం రోజున ఉదయం మృతి చెందాడు, విషయం తెలుసుకున్న జనగామ నియోజకవర్గం శాసన సభ్యులు డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి వారి నివాసం చేరుకొని మురళి కార్తీక్ మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యశీ చెప్పారు

## రెండు డీఏల మంజూరుపై టీఎస్‌యూటీఎఫ్ హర్షం

**నారాయణఖేడ్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రభుత్వ ఉద్యోగులకు రెండు విడతల కరువు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. జీఓ నంబర్ 128 ప్రకారం 2024 జనవరి 1 నుంచి డీఏను 33.67 శాతం నుంచి 37.31 శాతానికి, జీఓ నంబర్ 130 ప్రకారం 2024 జూలై 1 నుంచి 40.04 శాతానికి పెంచినట్లు జిల్లా అధ్యక్షుడు కంబాపురం అశోక్, ప్రధాన కార్యదర్శి బి. సాయిలు తెలిపారు. పెంచిన డీఏను అక్టోబర్ 2026 వేతనంతో కలిపి నవంబర్ 1న చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. టీజీఈజేఏసీ పోరాట ఫలితంగా డీఏ ఉత్తర్వులు వెలువడటం సంతోషకరమన్నారు. 2023 జూలై నుంచి అమలు కావాల్సిన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, ఎన్నికల హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## చారిత్రక అన్వేషణలో స్త్రీవాదులు

### ఆతిథ్య ఉపన్యాసంలో వివరించిన ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఊర్వశి బుటాలియా



**పటాన్ చెరు, అక్టోబర్ 7, (తెలంగాణ వాణి)**



ప్రముఖ స్త్రీవాద రచయిత్రి, ప్రచురణకర్త, కార్యకర్త, జుబాన్ బుక్స్ సహ వ్యవస్థాపకురాలు ఊర్వశి బుటాలియా, బుధవారం హైదరాబాదులోని గీతం విశ్వవిద్యాలయంలో ‘ఆర్కైవ్ అన్వేషణలో స్త్రీవాదులు’ అనే అంశంపై ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమాన్ని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) లోని ఆంగ్ల, ఇతర భాషల విభాగం నిర్వహించింది. సాంప్రదాయ చారిత్రక రికార్డులలో తరచుగా కనిపించని మహిళలు, అణగారిన వర్గాల గొంతులు, అనుభవాలను వెలికితీయడంలో ఆర్కైవ్ ల ప్రాముఖ్యతను బుటాలియా విశ్లేషించారు. జుబాన్ ఆర్కైవ్ ప్రస్థానం నుంచి స్ఫూర్తి పొందుతూ, ఎవరి చరిత్రలు భద్రపరచ బడుతున్నాయి, ఎవరి గొంతులు వినిపించడం లేదు అనే ప్రశ్నలను వేయడం యొక్క ప్రాముఖ్యతను ఆమె నొక్కి చెప్పారు. దాదాపు 1,500 పోస్టర్లు, 120 మౌఖిక చరిత్ర ఇంటర్వ్యూల సేకరణ, డిజిటలైజేషన్ తో సహా, భారతదేశ వ్యాప్తంగా స్త్రీవాద ఉద్యమాలను నమోదు చేయడానికి జుబాన్ చేస్తున్న ప్రయత్నాల గురించి ఆమె వివరించారు. పరిరక్షణ, మెటాడేటా సృష్టి, కాపీరైట్, సమ్మతి వంటి సవాళ్లు, అలాగే చారిత్రక సామగ్రికి ప్రజల ప్రాప్యతను విస్తరించడంలో డిజిటల్ ఆర్కైవ్ ల పాత్ర గురించి కూడా ఆమె చర్చించారు. బుటాలియా డిజిటల్ ఆర్కైవ్ ను ప్రదర్శించి, ముఖాముఖి ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు.

## 24 గంటలు వెలుగుతున్న వీధి దీపాలు

### చిన్నగనాపూర్‌లో విద్యుత్ వృథాపై గ్రామస్థుల ఆవేదన




**నర్సాపూర్/కొల్చారం, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్నగనాపూర్‌లో వీధి విద్యుత్ దీపాలు పగలు, రాత్రి తేడా లేకుండా 24 గంటలూ వెలుగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో విద్యుత్‌తో పాటు ప్రజాధనం వృథా అవుతోందని, గ్రామ పాలకవర్గం వెంటనే స్పందించి అవసరమైన సమయాల్లో మాత్రమే దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు గ్రామంలోని డ్రైనేజీలు సక్రమంగా నిర్వహించకపోవడంతో మురుగు పేరుకుపోతుందని, రోడ్లపై పిచ్చిమొక్కలు పెరిగి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. దోమల బెడద పెరుగుతున్న నేపథ్యంలో డ్రైనేజీలను శుభ్రం చేసి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



## అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని వినతి

**కోరుట్ల రూరల్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
సాతారం గ్రామంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ధర్మారం గ్రామ సర్పంచ్ రంజిత్‌రెడ్డి కలిసి ప్రభుత్వ పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సూర్య తండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం



**దేవరకొండ, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
దేవరకొండ మండలం సూర్య తండా అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ నేనావత్ కవిత లచ్చిరామ్ అధ్యక్షతన పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ డి. చిట్టెమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ కవిత మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దస్లీ, సువర్ణ, లలిత, గ్రామ పెద్దలు, తల్లులు పాల్గొన్నారు.

## సేవా జ్యోతి ర్యాలీ

### పాల్గొన్న బిజెపి ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్



**పెద్ద శంకరంపేట, అక్టోబర్ 7, (తెలంగాణ వాణి):**
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహిస్తున్న సేవా హబ్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా జ్యోతి ర్యాలీ లో కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి తో పాటు కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ అధ్యక్షులు కోణం విఠల్ పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోడీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందు తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, జిల్లా బిజెపి నాయకులు యాదగిరి పటేల్, అశోక్ కుమార్, రమేశ్ సగుణాకర్ . సాయి పటేల్, అధిక సంఖ్యలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## ఘనంగా 9వ పోషణ మాస కార్యక్రమం

### గర్భిణీలకు శ్రీమంతం.. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం



**నారాయణఖేడ్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి**
) మహిళా శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ నారాయణఖేడ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 9వ పోషణ మాస కార్యక్రమాన్ని జూకల్ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ నగేష్ కుమార్ షెట్కార్ పాల్గొని, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అంది ంచడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. జిల్లా సంక్షేమ అధికారి కె. లలితకుమారి మాట్లాడుతూ గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు ఐరన్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం వంటి పోషకాలను తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
కార్యక్రమంలో సీడీపీఓ ఎన్. సుజాత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జమున, ప్రమీల, బ్యూలా డేవిడ్, జెండర్ స్పెషలిస్ట్ విశాల, డీహెచ్ఏడబ్ల్యూ సిబ్బంది నర్సింలు, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ నివర్తి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి ఆస్తుల పరిరక్షణలో ఎస్అండ్‌పీసీ సేవలు అభినందనీయం



**మందమర్రి, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
సింగరేణి ఆస్తుల పరిరక్షణలో ఎస్అండ్‌పీసీ, మొబైల్ ట్రాన్స్‌పోర్ట్ ఫోర్స్ (ఎంటీఎఫ్) సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించారని ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ అభినందించారు. మంజునాథ ఫంక్షన్‌హాల్ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన వ్యాన్‌ను తనిఖీ చేయగా, అందులో సింగరేణికి చెందిన రెండు ఖరీదైన కరెంట్ మోటార్లు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. మోటార్లు, వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. సిబ్బందిని జీఎం శాలువాతో సన్మానించి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. సంస్థ ఆస్తుల పరిరక్షణ ప్రతి ఉద్యోగి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి.ఎల్. ప్రసాద్, డిజిఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక బహిష్కరణలపై బీసీ కమిషన్‌కు ఫిర్యాదులు




**నిజామాబాద్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సామాజిక, కుల బహిష్కరణలపై బాధితుల నుంచి తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌కు పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ నేతృత్వంలోని సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మిల బృందం బుధవారం నిజామాబాద్ ఐడీఓసీలో బాధితులతో భేటీ అయింది. బాధితులు గ్రామాభివృద్ధి కమిటీల పేరిట జరుగుతున్న ఘటనలు, సామాజిక బహిష్కరణలపై లిఖితపూర్వకంగా విజ్ఞాపనలు సమర్పించారు. బీసీ కుల సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు కూడా తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

## మందమర్రి పట్టణ అభివృద్ధే లక్ష్యం

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**మందమర్రి, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
మందమర్రి మున్సిపాలిటీ అభివృద్ధే తన లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 14వ వార్డులో రూ.35.10 లక్షలు, 3వ వార్డులో రూ.75.50 లక్షలు, 20వ వార్డులో రూ.53.60 లక్షలు, 2వ వార్డులో రూ.1.03 కోట్లతో పనులు ప్రారంభించారు. మార్కెట్ ప్రాంతంలో సుమారు రూ.14 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రజా సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆర్టీసీ కార్మికుల హక్కులకు కాంగ్రెస్ అండ



**మంచిర్యాల, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి):**
ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. కార్మిక సంఘాల ఎన్నికల్లో బాణం గుర్తుపై ఓటు వేసి తెలంగాణ వర్కర్స్ యూనియన్-ఐఎన్‌టీయూసీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను మంజూరు చేసి కార్మికులకు అందించిందని తెలిపారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను చేపడతామని హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు

## సీసీఐ బకాయిలు చెల్లించాలి



**ఆదిలాబాద్, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సీసీఐ ఫ్యాక్టరీ డిస్మాంటిల్ నేపథ్యంలో ఆదిలాబాద్ మున్సిపాలిటీకి రావాల్సిన రూ.4.44 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించేలా సీసీఐ అధికారులను ఆదేశించాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సీసీఐ బకాయిల అంశంపై ఇప్పటికే పలుమార్లు ఢిల్లీ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్‌తో పాటు మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, పర్వేజ్ మహబూబ్ , నాక్సన్ , కిషోర్ సలీం , రషీద్ , రిజ్వాన్ , బబ్లు అన్నపూర్ణ., టీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలకు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం

- ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి ఎక్సైజ్ అధికారులతో సమీక్ష



**నిజామాబాద్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలు, వినియోగంపై గట్టి నిఘా ఉంచి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఎక్సైజ్, సంబంధిత శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో గుడుంబా, నాటుసారా విక్రయాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, యువత, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్న గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు సమన్వయంతో దాడులు నిర్వహించాలని ఆదేశించారు. కల్తీకల్లు తయారీలో వినియోగించే అక్రమ పదార్థాల సరఫరా మూలాలను గుర్తించి, సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, గుడుంబా, నాటుసారా తదితర మత్తు పదార్థాల ఆనవాళ్లు లేకుండా నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. అవసరమైన చోట పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలకు 100 మీటర్ల పరిధిలో సిగరెట్లు, గుట్కా తదితర పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా రెవెన్యూ అధికారి గీత, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. శ్రీధర్, సూపరింటెండెంట్ నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పేరుతో వీడీసీల అరాచకాలను ఉపేక్షించొద్దు

**సామాజిక బహిష్కరణలపై కఠిన చర్యలు: బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్**

**నిజామాబాద్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అభివృద్ధి పేరుతో గ్రామ అభివృద్ధి కమిటీలు (వీడీసీలు) ప్రజలను సామాజిక బహిష్కరణలకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ అధికారులను ఆదేశించారు. సామాజిక బహిష్కరణలు, జరిమానాల పేరుతో ప్రజలను వేధించడం అనాగరికమని, ఈ దుశ్చర్యలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. నిజామాబాద్‌లో బుధవారం కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్, రాపోలు జయప్రకాశ్, బాలలక్ష్మిలతో కలిసి బాధితులతో భేటీ అయ్యారు. సుమారు 90 మంది బాధితులు తమ సమస్యలను వివరిస్తూ కమిషన్‌కు లిఖితపూర్వక ఫిర్యాదులు అందించారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి రెవెన్యూ, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. వీడీసీలు చట్ట పరిధిలో పనిచేసేలా పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, బాధితులకు సత్వర న్యాయం, అవసరమైతే ఉచిత న్యాయ సహాయం అందించాలని నిరంజన్ సూచించారు. సామాజిక బహిష్కరణలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. వీడీసీల ఆగడాలను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.



**త్వరలో బీసీ ప్రొటెక్షన్ యాక్టు:**
ఎస్సీ, ఎస్టీలకు అట్రాసిటీ చట్టం తరహాలో బీసీల రక్షణ కోసం బీసీ ప్రొటెక్షన్ యాక్టును త్వరలో అమలు చేయనున్నట్లు నిరంజన్ తెలిపారు. ఇందుకు సంబంధించి కమిషన్ ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, డీ.ఆర్.ఓ గీత, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి నిజామాబాద్, ఆర్మూర్ ఏ.సీ.పీలు ప్రకాశ్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, బీ.సీ కమిషన్ అధికారులు సునీత, ఇర్ఫాన్, సతీష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సాయికుమార్, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## గంజాయి సాగు..నిందితుడు అరెస్ట్

**చెన్నూర్, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి):**
కోటపల్లి మండలం ఎదుల్లబందం గ్రామంలో ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని మూడు మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గం మహేష్ (33) ఇంట్లో నమ్మదగిన సమాచారంతో తనిఖీలు నిర్వహించగా గంజాయి మొక్కలు గుర్తించారు. వ్యవసాయ శాఖ ఏఈఓ పరిశీలనలో అవి గంజాయి మొక్కలేనని నిర్ధారణ అయింది. 12, 14 అంగుళాల ఎత్తు కలిగిన మూడు మొక్కల విలువ సుమారు రూ. 4,600 గా అంచనా వేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంజాయి సాగు, విక్రయాలు, రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు



**మంచిర్యాల, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి):**
గ్రామాల్లో సురక్షిత తాగునీరు, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. భీమారం మండలం దాంపూర్‌లో రూ.3.25 లక్షలతో ఏర్పాటు చేసిన బాలవికాస నీటి శుద్ధికరణ పథకాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 20 లీటర్ల శుద్ధి నీటిని రూ.5కే అందిస్తున్నట్లు తెలిపారు. నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచి, పొదుపుగా వినియోగించాలని సూచించారు. గ్రామంలో 72 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, రూ.4 కోట్లతో సీసీ రహదారుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, పల్లె దవాఖాన, బతుకమ్మ కోసం హైమాస్ట్ లైట్లు, బోర్ల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



## భూవ్యవహారాలపై చిట్టా సిద్ధం: ఉప్పలయ్య

**మంచిర్యాల, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి):**
మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై మాజీ మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య ఆరోపణలు చేశారు. భూవ్యవహారాలు, అక్రమాలు, అవినీతికి సంబంధించిన పూర్తి వివరాలు తమ వద్ద ఉన్నాయని, త్వరలో వాటిని బయటపెడతామని తెలిపారు. ఎమ్మెల్యే దౌర్జన్య, అహంకార ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణకు పలుమార్లు అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. మహాప్రస్థానం, భూవ్యవహారాలు, ఇతర అక్రమాలకు సంబంధించిన అంశాలతో పాటు మేయర్, పలువురు కాంగ్రెస్ నాయకుల వ్యవహారాలను కూడా వెలుగులోకి తెస్తామని ఉప్పలయ్య పేర్కొన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి పోటీ చేయాలని సవాల్ విసిరారు. కార్పొరేషన్‌లో అక్రమాలకు పాల్పడిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకునేలా పోరాడుతామని తెలిపారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి




**నిజామాబాద్, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచించారు. జిల్లా కేంద్రంలోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ కళాశాలలో బుధవారం విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, ఫేక్ ప్రొఫైల్, డీప్‌ఫేక్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, లోన్, ఆన్‌లైన్ షాపింగ్ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని లింకులు, యాప్‌లు, ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దన్నారు. సైబర్ మోసంలో డబ్బు కోల్పోతే వెంటనే 1930కు ఫోన్ చేసి, ßసైబర్ క్రైమ్ పోర్టల్‌లోꢀ(https://cybercrime.gov.in?utm_sourceR chatgpt.com) ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్య...

## పత్తి కొనుగోళ్లు సజావుగా చేపట్టాలి

**నిర్మల్, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి విలేకరి):**
పత్తి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా, సజావుగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ నమోదు చేసుకుని పత్తిని విక్రయించవచ్చన్నారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం గోదావరి పుష్కరాల పనులపై సమీక్ష నిర్వహించారు. పుష్కర ఘాట్లలో నిర్మాణ పనులను ప్రత్యేక బృందాలు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, సిపిఓ గంగారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి రమణ, హౌసింగ్ పిడి శ్రీనివాస్, నీటిపారుదల, ఆర్ అండ్ బి ఈఈ లు అనిల్, సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



## మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత



**ఆదిలాబాద్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఎన్ఆర్ఎల్ఎం పథకంలో భాగంగా రాజర్షిషాగూడ గ్రామానికి చెందిన ఝూన్సీ లక్ష్మీ, అంజలి మహిళా సంఘాలకు మేకల పెంపకం కోసం ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఒక్కో సంఘంలోని నలుగురు సభ్యులకు రూ.25 వేల చొప్పున మొత్తం రూ.లక్ష రుణం అందించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఏపిఎం అనిల్, డిపిఎం శోభా, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పోలీసు-ప్రజల సత్సంబంధాలు బలోపేతం

### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గ్రామాల్లో పోలీసు-ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో భాగంగా యాపలగూడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులు ఆదివాసీ సంప్రదాయాలతో గుస్సాడి నృత్యాలు, వాయిద్యాలతో ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం కొమురం భీం విగ్రహానికి నివాళులర్పించారు. 26 గ్రామాల జట్లు పాల్గొన్న వాలీబాల్ పోటీల ఫైనల్‌ను వీక్షించి, విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రహీం పాషా, ఎస్ఐ వి. విష్ణువర్ధన్, గ్రామ సర్పంచ్ కొడప నిరోషా, ఉప సర్పంచ్ తోన్పుల దత్తు, గ్రామస్తులు, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, యువత, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్



**నిజామాబాద్, అక్టోబర్ 07 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి అదనపు కలెక్టర్ వి.భుజంగరావు తో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి శంకర్, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## అంగన్వాడీ టీచర్ నియామక ఇంటర్వ్యూలు



**ఆదిలాబాద్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గాదిగూడ మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్ల నియామకానికి ఇంటర్వ్యూలను పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. కలెక్టరేట్‌లో ఐటీడీఏ పీవో మంద మకరందుతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 283 దరఖాస్తులు రాగా, పరిశీలన అనంతరం 47 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో 46 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా, ఒకరు గైర్హాజరయ్యారు. నియామక ప్రక్రియలో మెరిట్, నిబంధనలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సాధన, గిరిజన సంక్షేమ శాఖ డి.డి. అశోక్, ఇతర సంబంధిత శాఖల అధికారులు, అభ్యర్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిట్యాల్‌బోరిలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**ఆదిలాబాద్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఆదిలాబాద్ రూరల్ మండలం చిట్యాల్‌బోరి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించడంతో పాటు రూ.10 లక్షలతో నిర్మించనున్న వీవో భవనం, రూ.5 లక్షలతో చేపట్టనున్న పాఠశాల ప్రహరీ గోడకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమ్రా లక్ష్మీ వసంత్, ఉప సర్పంచ్ ఉయికే అనిత, పంచాయతీ కార్యదర్శి పి. చైతన్య, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## నకిలీ జీపీఏతో భూ లావాదేవీలు

### ఐదుగురు అరెస్ట్.. మధ్యవర్తుల పాత్రపై దర్యాప్తు




**కీసర, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి):**
నకిలీ జీపీఏ, తప్పుడు స్థిరాస్తి పత్రాలతో కోట్ల విలువైన భూములను అక్రమంగా విక్రయించిన కేసులో కీసర పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. చీర్యాల గ్రామం సర్వే నంబర్ 94లోని 18 ఎకరాల 19 గుంటల భూమికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి పలు ప్లాట్లకు సేల్‌డీడ్‌లు రిజిస్ట్రేషన్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో బసరికారి శ్రీనివాస్‌రావు, బార్లపాటి ఆనంద్, బొర్రా వెంకటేష్, మిర్ సాదిక్ అలీ, రామిడి సత్తిరెడ్డిలను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు అనుమానిస్తున్న తటాకం నారాయణశర్మ, జూపల్లి రవీందర్ పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. భూములు కొనుగోలు చేసేవారు యాజమాన్య హక్కులు, రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలను పూర్తిగా పరిశీలించాలని పోలీసులు సూచించారు.

## నాగారంలో బీజేపీ సేవా జ్యోతి యాత్ర

### బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి: మధుకర్



**నాగారం, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి):**
నాగారం డివిజన్‌లోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా జ్యోతి యాత్రకు సుమారు వెయ్యి మంది నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ సంఘటన మంత్రి మధుకర్ మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో నాగారం డివిజన్‌లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, జిల్లా ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, కొంపల్లి మోహన్ రెడ్డి, వై. సుదర్శన్ రెడ్డి, శోభారెడ్డి, వెంకట్ రెడ్డి, తిరుమల రెడ్డి, అమరం మోహన్ రెడ్డి, గోనె శ్రీనివాస్, బి.టి. లక్ష్మి, ఘనపురం శ్యాంసుందర్ శర్మ, ఏనుగు రాజిరెడ్డి, కొండబోయిన నాగరాజు యాదవ్, బిజ్జా శ్రీనివాస్ గౌడ్, తరిగొప్పుల బలరాం, మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



**ఎల్లారెడ్డి, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు మున్సిపల్ చైర్మన్ పద్మా శ్రీకాంత్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ప్రత్యేక చొరవతో నియోజకవర్గానికి పెద్ద ఎత్తున ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జెగ్జీవన్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మంచిర్యాల విద్యాసాగర్, కౌన్సిలర్లు సిద్ది శ్రీధర్, సయ్యద్ గఫార్, అట్కారి చంద్రయ్య, దశరథ్, కో-ఆప్షన్ సభ్యుడు పప్పు వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు రఫీక్, వసీమ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ కంజర్ భూ సమస్యలకు త్వరలో పరిష్కారం



**నిర్మల్, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి విలేకరి):**
లక్ష్మణచందా మండలం న్యూ కంజర్, చామన్‌పల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం పర్యటించి భూ సమస్యలు, రీ-సర్వే పనులను పరిశీలించారు. న్యూ కంజర్‌లో గ్రామస్తులతో సమావేశమైన కలెక్టర్ భూ పట్టాలకు సంబంధించిన సమస్యలను గ్రామసభల ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చామన్‌పల్లిలో కొనసాగుతున్న రీ-సర్వే పనులను పరిశీలించి, మిగిలిన ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. రైతుల సమక్షంలో పారదర్శకంగా సర్వే నిర్వహించి, వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ విఠల్, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో వనజ, సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, లక్ష్మి, ఉప సర్పంచ్‌లు ముత్యం, గంగారెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనురాధ మృతికి మాజీ ఎమ్మెల్యే నివాళి

**నకిరేకల్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
కట్టంగూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ శేరి అనురాధ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె పార్థివదేహాన్ని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## కొల్లూరు పెద్ద చెరువుకు డబుల్ బెడ్‌రూమ్ కాలనీ మురుగు నీరు!

**ఎస్టీపీ నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ ఏదీ స్థానికుల ఆందోళన**

**తెల్లాపూర్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కొల్లూరు శివారులోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీ నుంచి వెలువడుతున్న మురుగు నీరు కొల్లూరు పెద్ద చెరువుల్లోకి చేరుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చెరువు నీరు కలుషితమవడంతో పాటు పరిసర ప్రాంతాల్లో దుర్వాసన, ప్రజారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మోటార్లు, పంప్‌హౌస్ తదితర పరికరాలు తుప్పుపట్టి నిరుపయోగంగా మారినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎస్టీపీ నిర్వహణపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని వారు కోరుతున్నారు. ప్రజారోగ్యంతో పాటు చెరువు



పరిరక్షణకు సంబంధించిన సమస్య కావడంతో అధికారులు వెంటనే స్పందించి ఎస్టీపీని పరిశీలించి, మురుగు నీరు చెరువుల్లోకి చేరకుండా చర్యలు తీసు కోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాలనీలో మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.




## సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

**హుజూర్‌నగర్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో బుధవారం సైబర్ జాగృత దినోత్సవం, యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హుజూర్‌నగర్ సీఐతో పాటు పాలకవీడు, నేరేడుచర్ల ఎస్‌ఐలు పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గానికి సన్మానం



**వనపర్తి, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులను మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పోతుల అమరేందర్, వైస్ చైర్మన్ డాక్టర్ ప్రియాంక, స్టేట్ ఎంసీఎల్ స్వామి, కోశాధికారి విష్ణువర్ధన్, అరవిందలను సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా రక్తదానం, వైద్య సేవలు, విపత్తు సహాయక కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. సేవా కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేసి, పేదలు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని కోరారు.

## రాహుల్, ప్రియాంక అరెస్టుపై దైద ఖండన



**నకిరేకల్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ కార్యదర్శి ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమి ఎంపీల అరెస్టును తెలంగాణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అవకతవకలు, ఈసీఐనెట్ సాఫ్ట్‌వేర్ అంశాలపై ప్రశ్నించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్న విపక్ష నేతలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

## పోలీసుల బకాయిలు అందేలా చర్యలు




**వనపర్తి, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పోలీసులకు రావాల్సిన సరెండర్ బకాయిలు, టీఏలు చెల్లించడంతో పాటు ఈహెచ్‌ఎస్ హెల్త్ స్కీమ్ అమలు చేయాలని కోరుతూ జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎస్పీ డి. సునీతారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందు, ఉపాధ్యక్షులు ఆర్ఐ అప్పలనాయుడు, నాగరాజు, కార్యదర్శులు, సభ్యులు సమస్యలను ఎస్పీకి వివరించారు. స్పందించిన ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా బకాయిలు అందేలా, హెల్త్ స్కీమ్ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## ప్రేమ పేరుతో మోసం చేశారంటూ యువతి ఆందోళన



**వర్ధన్నపేట, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
ప్రేమ పేరుతో తనను మోసం చేశారంటూ ఓ యువతి వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి కుమారుడు పాలకుర్తి శ్రీకాంత్ ఇంటి ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టింది. తనకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని ఆమె స్పష్టం చేసింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ యువతిని పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఆమె ఆరోపణలపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. యువతికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. ఆందోళన నేపథ్యంలో చైర్మన్ ఇంటి వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది.

## కమ్యూనిటీ స్థలాన్ని కాపాడాలంటూ కాలనీవాసుల నిరసన



**చౌటుప్పల్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
చౌటుప్పల్ మున్సిపాలిటీ 12వ వార్డులోని కంచరకుంట్ల కాలనీ కమ్యూనిటీ స్థలాన్ని కబ్జా ప్రయత్నాల నుంచి కాపాడాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు నిరసన చేపట్టారు. సుమారు 800 గజాల స్థలాన్ని కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించినట్లు వారు తెలిపారు. కాలనీ అధ్యక్షుడు కోనేటి నరసింహ మాట్లాడుతూ.. 2003లో 30 ప్లాట్లతో ఏర్పాటైన వెంకట్‌రెడ్డి వెంచర్‌కు 2025లో అదనంగా ప్లాట్లు చేర్చి, కాలనీ కమ్యూనిటీ స్థలాన్ని వెంచర్‌లో భాగంగా చూపించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. 2017లో కమ్యూనిటీ హాల్ కోసం కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచరకుంట్ల సత్తిరెడ్డి స్థలం ఇచ్చారని తెలిపారు. ఇటీవల కొందరు కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, మహిళలను దుర్భాషలాడినట్లు ఆరోపిస్తూ ఎస్ఐ, డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కమ్యూనిటీ స్థలాన్ని రక్షించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, డీఎస్పీ, మున్సిపల్ అధికారులు, చైర్మన్‌ను కాలనీవాసులు కోరారు. కార్యక్రమంలో చెరుకు వెంకటేష్, ముత్యాలు, మహేందర్, లక్ష్మీనారాయణ, అంజయ్య, జలం ధర్, లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, జంగ య్యచారి, శ్రీకాంత్, యాదమ్మ, సుజాత, కమలమ్మ, సిరియాల పాల్గొన్నారు.

## దుర్గామాత విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్ అనుమతి తప్పనిసరి

**చౌటుప్పల్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**



శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపు, నిమజ్జనానికి నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని చౌటుప్పల్ సీఐ జి. మన్మథ కుమార్ తెలిపారు. మండపాల నిర్వాహకులు తెలంగాణ పోలీస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో "ఆన్‌లైన్ అప్లికేషన్" ద్వారా మండప వివరాలను నమోదు చేసి అనుమతి పొందాలని సూచించారు. దరఖాస్తు అనంతరం లభించే రసీదును భద్రపరుచుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఒయాసిస్ బాలుర ఆశ్రమంలో బెడ్‌షీట్లు, పండ్ల పంపిణీ



**హనుమకొండ, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి టౌన్):**
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కమిటీ సభ్యుడు మండల సమ్మయ్య తన తల్లిదండ్రులు కీర్తిశేషులు మండల ఉప్పలమ్మ, కట్టయ్యల జ్ఞాపకార్థం వడ్డేపల్లి చర్చి సర్కిల్‌లోని ఒయాసిస్ బాలుర ఆశ్రమంలో విద్యార్థులకు బెడ్‌షీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యకు సంబంధించి అవసరమైన సహాయ సహకారాలు తన వంతుగా అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒయాసిస్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఒద్ది రాజు చంద్రప్రకాష్ మరియు ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టుల భర్తీ పారదర్శకంగా చేపట్టాలి



**నిర్మల్, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి విలేకరి):**
జిల్లాలోని 89 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో దరఖాస్తులు, అర్హతలు, ధ్రువీకరణ పత్రాల పరిశీలనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పకడ్బందీగా పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హులకు న్యాయం చేయాలని సూచించారు. భర్తీ చేయిస్తామని చెప్పే దళారులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని, అధికారిక సమాచారాన్నే పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, సీడీపీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాల్‌బోరిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

### ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలిసి పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఆదిలాబాద్, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ఆదిలాబాద్ రూరల్ మండలం చిట్యాల్‌బోరి గ్రామంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. రూ.10 లక్షలతో నిర్మించనున్న వీవో భవనం, రూ.5 లక్షలతో చేపట్టనున్న పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమ్రా లక్ష్మీ వసంత్, ఉప సర్పంచ్ ఉయికే అనిత, పంచాయతీ కార్యదర్శి పి.చైతన్య, గ్రామ పటేల్ కె.మనోహర్, గ్రామ దేవరి టి.గంగారాం, గ్రామస్థులు వసంత్, జల్లు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం




**ఆదిలాబాద్, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి.హుస్సేన్ మాట్లాడుతూ బాలికలు మాయమాటలకు మోసపోకుండా లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, సమస్యలు ఎదురైతే 1098, 100, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలిత కుమారి, చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి గంగారం, డిప్యూటీ కౌన్సిల్ సభ్యులు అరుగుల అశోక్, చంద్రకాంత్‌చౌదరి, ఉమేష్‌రావు డోలే, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, డీసీపీయూ కౌన్సిలర్ పద్మ, ఎయిడ్ జిల్లా కోఆర్డినేటర్ కె.వినోద్, నీతి ఆయోగ్ చైల్డ్ రైట్స్ అసోసియేట్ దేవిశ్రీ, కమ్యూనిటీ మొబిలైజర్లు సంపత్ కిరణ్, కె.శంకర్ పాల్గొన్నారు.

## ఓటర్ల విచారణపై అఖిలపక్ష సమావేశం



**ఎల్లారెడ్డి, అక్టోబర్ 07 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో అధ్యక్షతన బుధవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటివరకు జరిగిన పురోగతిని అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. నియోజకవర్గంలోని 283 పోలింగ్ కేంద్రాల పరిధిలో 56,469 నోటీసులు జారీ చేయగా, 50,578 మంది ఓటర్లపై విచారణ పూర్తయిందని, మొత్తం 87.49 శాతం ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. రాజంపేట, ఎల్లారెడ్డి, సదాశివనగర్ మండలాలు పురోగతిలో ముందంజలో ఉన్నాయని అధికారులు తెలిపారు. లాజికల్ డిస్క్రెపెన్సీలు, నో మ్యాపింగ్ కేటగిరీల్లోని ఓటర్లకు నోటీసులు ఇచ్చి అర్హతను పరిశీలిస్తామని, అనర్హులను నిబంధనల ప్రకారం తొలగిస్తామని ఆర్డీవో తెలిపారు. బీఎల్‌ఓలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నుంచి మొహమ్మద్ అజర్, బీఆర్ఎస్ నుంచి సతీష్, ఎంఐఎం నుంచి అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక



## చిలుకూరు ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవం

### అధ్యక్షుడిగా దొంతగాని సైదులు గౌడ్



**చిలుకూరు, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి)**
: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (143) చిలుకూరు మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మల్లెపంగు సూరిబాబు, అధ్యక్షుడిగా దొంతగాని సైదులు గౌడ్, ఉపాధ్యక్షుడిగా గంగిరెడ్డి అశోక్‌రెడ్డి, కార్యదర్శిగా బట్టు సంతోష్, సహాయ కార్యదర్శిగా కాంపాటి శ్రీనివాసరావు, కోశాధికారిగా కోల శ్రీనివాస్ గౌడ్, సలహాదారుగా కుర్ర రామారావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బాలే బోయిన వినయ్‌కుమార్, బట్టు శ్యామ్‌కుమార్ నాయక్, బోడ శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దొంతగాని సైదులు గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణకు ఐక్యంగా కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు నిష్పక్షపాత జర్నలిజానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తామని తెలిపారు.

## అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**వనపర్తి, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వనపర్తిలో అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి సుమారు రెండు గంటలపాటు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ. ఖాదర్ పాషా మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కును హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శివసేనారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఎస్పీ సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు ఆక్కల బాబు గౌడ్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు అరుణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య, కదిరే రాములు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.కృష్ణ, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుగౌడ్, మాజీ కౌన్సిలర్ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రారంభం



**చౌటుప్పల్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో చౌటుప్పల్‌లో బుధవారం పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా జనసేన నాయకుడు ఆముదాల పరమేశ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. పార్టీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు కోసం జనసేన నాయకులు, జనసైనికులు ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కూనపురెడ్డి శివ కార్తీక్, పీవోసీ పీక ప్రవీణ్, పల్చం శ్రీకాంత్, సరికొండ సంజయ్, నిఖిల్, రమణబాబు, రాజు, గణేశ్, నజీర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## 29వ డివిజన్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

### నవంబర్ 6 చివరి గడువు



**వరంగల్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి)**
: వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 29వ డివిజన్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని కుడా మాజీ చైర్మన్, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవ రెడ్డి ప్రారంభించారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు సదాంత్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యాదవ రెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు అవసరమైన ధ్రువపత్రాలతో నవంబర్ 6లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు నమోదైనప్పుడే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన నాగూర్ల

**వరంగల్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
వరంగల్ తూర్పు నియోజకవర్గం శివనగర్‌కు చెందిన నటరాజ్ సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ నిర్వాహకుడు సతీష్ సోదరుడు బజ్జూరి సునీల్ కుమార్ (55) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు సునీల్ కుమార్ నివాసానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్ అసోసియేషన్ నాయకులు భారత్ సీడ్స్ నాగరాజ్, పిన్నింటి రాజేందర్‌రెడ్డి, ఏలేందర్‌రెడ్డి, రమేష్, కిష్టాజి, నారాయణ, పరమేష్, ప్రవీణ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



# పేదల ఇళ్లు కూల్చే రాజ్యం ఇది

### చెరబండరాజు కాలనీ వాసులకు అండగా ఉంటాం: దాస్యం వినయ్‌భాస్కర్



**తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో, (అక్టోబర్ 7 ) :**
కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లు కూల్చుతూ, పేదల పొట్టకొడుతోందని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. భద్రకాళీ ఆలయ సమీపంలోని చెరబండరాజు కాలనీలో గుడిసెల కూల్చివేతకు గురైన బాధితులను పరామర్శించేందుకు వెళు_న్న ఆయనను సుబేదారి పోలీసులు అరెస్టు చేసి వడ్డేపల్లిలోని నివాసానికి తరలించి సాయంత్రం వరకు నిర్బంధించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. మార్పు పేరుతో పేదలను మోసం చేస్తున్న ప్రభుత్వం, ఇప్పుడు బుల్డోజర్లతో వారి ఇళ్లు కూల్చుతోందని ఆరోపించారు. కాలనీ వాసుల ఇళ్ల కూల్చివేతపై హైకోర్టులో స్టేటస్‌కో ఉందని, మానవ హక్కుల కమిషన్ ఈ నెల 29న విచారణ చేపట్టనుందని తెలిపారు. అయినా కూల్చివేతలు చేపట్టడం సరికాదన్నారు .కాలనీ వాసులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఉద్యోగాలు ఇస్తామని గతంలో హామీ ఇచ్చి అమలు చేయలేదని ఆరోపించారు. బాధితుల తరఫున ప్రశ్నిస్తున్న తనను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఎన్ని కేసులు పెట్టినా చెరబండరాజు కాలనీ వాసులకు అండగా ఉంటామని, వారి తరఫున న్యాయస్థానాల్లోనూ, ప్రజాక్షేత్రంలోనూ పోరాడుతామని స్పష్టం చేశారు. భద్రకాళీ ఆలయ అభివృద్ధికి తాము పూర్తి సహకారం అందిస్తామని, అయితే పేదలకు న్యాయం చేసిన తర్వాతే స్థల సేకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అభివృద్ధి పేరుతో పేదల హక్కులను కాలరాయడం సరికాదన్నారు.



## బీబీపేట్ పీఏసీఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

**రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం: మహమ్మద్ అలీ షబ్బీర్**

**కామారెడ్డి, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి స్పెషల్ కరస్పాండెంట్ టీ.ఎన్. రమేష్):**
బీబీపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన చైర్మన్ సుతారి రమేష్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతులకు పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా పీఏసీఎస్‌లు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా వంటి పథకాలను రైతులకు





వివరించారు. రాజకీయ భేదాలకు అతీతంగా ప్రతి రైతుకు సమానంగా సేవలందిస్తూ పీఏసీఎస్‌ను మరింత బలోపేతం చేయాలని నూతన చైర్మన్ రమేష్‌ను కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఇల్యాస్, బీబీపేట్ సర్పంచ్ సాత్విక సాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనరెడ్డి, సొసైటీ చైర్మన్లు ఇంద్రకరణ్‌రెడ్డి, గూడెం శ్రీనివాస్, భీంరెడ్డి, సుధాకర్, అనంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి సన్మానం




**రాయికోడ్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాయికోడ్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కేదార్‌నాథ్ పటేల్‌ను మాజీ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవుసలి ప్రభాకర్ పార్టీ నాయకులతో కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో మండలంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం సేవలందించిన మాజీ మండల అధ్యక్షుడు బాలాజీ నర్సింలుకు ధన్యవాదాలు తెలిపారు. నూతన అధ్యక్షుడు నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వీరభదరేశ్వర ఆలయ చైర్మన్ సతీష్ కులకర్ణి,సీనియర్ నాయకులు రవికుమార్ పాటిల్,రొడ్డ శ్రీనివాస్ పటేల్,శ్రీశైలం,నాయకులు వీరేశం,సాజిద్ మియా, మోహన్,తదితరులు పాల్గొన్నారు

## ఆర్టీసీ ఎన్నికల్లో కార్మికుల సమస్యలపై పోరాడే కూటమికి మద్దతివ్వాలి: చాడ



**కరీంనగర్, అక్టోబర్ 7 (తెలంగాణవాణి ప్రతినిధి)**
ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ యూనియన్--టీఎంయూ కూటమిని గెలిపించాలని సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ జోనల్ వర్క్‌షాప్‌తో పాటు కరీంనగర్-1, 2, సిరిసిల్ల, వేములవాడ డిపోల్లో కార్మికులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై కార్మికుల గొంతుకగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, మంద సుదర్శన్‌తో పాటు ఎంప్లాయిస్ యూనియన్, టీఎంయూ నాయకులు బెజ్జంకి కాళిదాసు, కొమురయ్య, ఏ.వి.ఆర్. రెడ్డి, ఎం. ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## కొత్తగట్టులో నాలుగో రోజుకు నిరవధిక సమ్మె

### అండర్‌పాస్ నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్

**శంకరపట్నం, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు వద్ద జాతీయ రహదారి--563పై అండర్‌పాస్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ గొల్లపల్లి, కొత్తగట్టు గ్రామస్తులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాలుగో రోజుకు చేరింది. రహదారి డివైడర్లు, బారికేడ్ల కారణంగా పంచాయతీ కార్యాలయం, స్మశానవాటిక, వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేందుకు కిలోమీటర్ల మేర యూటర్న్ తీసుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసి సమస్య వివరించినప్పటికీ బుధవారం వరకు అధికారులు గ్రామాన్ని సందర్శించలేదని తెలిపారు. రెండు గ్రామాల ప్రజల సౌకర్యార్థం వెంటనే అండర్‌పాస్ నిర్మించాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేసి వంటావార్పు, అధికారుల కార్యాలయాల ముట్టడి చేపడతామని హెచ్చరించారు

## మున్నూరు కాపు మహిళా సంఘం అధ్యక్షురాలిగా తోట స్వప్న



**జమ్మికుంట, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట మున్సిపాలిటీ మోత్కులగూడెంలో మున్నూరు కాపు మహిళా సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా తోట స్వప్న, కార్యదర్శిగా పొనగంటి విజయ, కోశాధికారిగా పొనగంటి స్వప్న, ఉపాధ్యక్షురాలిగా పొన గంటి వాసవి, సహాయ కార్యదర్శిగా పొనగంటి ఉమాదేవి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తోట స్వప్న మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షురాలిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారంతో పాటు సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, పీఏసీఎస్ అధ్యక్షులు పొనగంటి సంపత్, కౌన్సిలర్లు పొనగంటి రామ్మూర్తి, విష్ణుతో పాటు మున్నూరు కాపు మహిళా సంఘం సభ్యులు, మహిళలు మరియు పలువురు స్థానికులు పాల్గొన్నారు.



## జానపద కళాకారుడు గుండ్ర కృపాదానంకు ఘన సన్మానం

**కరీంనగర్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: జానపద కళల పరిరక్షణ, అభివృద్ధికి 34 ఏళ్లుగా సేవలందిస్తున్న కళాకారుడు గుండ్ర కృపాదానంను కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా యంత్రాంగం ఘనంగా సన్మానించింది. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, రెవెన్యూ కలెక్టర్ బి. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆయన సేవలను అభినం దించారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన వయో వృద్ధుల దినోత్సవంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న కృపాదానంను సాహితీవేత్తలు, కళాకారులు అభినందించారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



**రాయికోడ్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం కర్చల్ గ్రామంలో సర్పంచ్ ఊర్మిళ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ చైతన్య కిరణ్ సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిం చారు. ఓటీపీ, బ్యాంకింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఏపీకే లింకులను తెరవవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులు సమాజానికి మార్గదర్శకులు

### వృద్ధుల సంరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి: అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే




**కరీంనగర్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
వయోవృద్ధులు తమ జీవిత అనుభవాలతో సమాజానికి మార్గదర్శకులని, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధాప్యాన్ని బలహీనతగా చూడకుండా గౌరవించాలని సూచించారు. వయోవృద్ధుల సంక్షేమం, భద్రత కోసం అమలవుతున్న చట్టాలు, పథకాలను అర్హులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య సంరక్షణకు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఎంహెచ్‌వో రాజగోపాల్‌రావు, డీఆర్‌డీవో గీత, అధికారులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

## ట్రూ అప్ చార్జీల భారం మోపొద్దు: సీపీఎం

**కరీంనగర్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపే నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులపై అదనపు చార్జీలు మోపడం సరికాదన్నారు. నిర్ణయాన్ని విరమించుకోకపోతే 2000 నాటి విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## నూతన ఎస్ఐకు అంతర్గాం సర్పంచ్ అంబోతు రవికుమార్ ఆత్మీయ స్వాగతం




**పెద్దపల్లి, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
అంతర్గాం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన టి. ఉదయ్ కిరణ్‌ను అంతర్గాం సర్పంచ్ అంబోతు రవికుమార్ శాలువాతో సన్మానించి, ఏపీజే ట్రస్ట్ మెమెంటో అందజేసి స్వాగతం పలికారు. గ్రామంలో శాంతిభద్రతలు, ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖకు సహకరిస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ యువత ఎస్ఐకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక



## కిచ్చన్నపేట పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**నాగిరెడ్డిపేట, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తాండూర్ కిచ్చన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా బోగుడమీది శ్రీధర్‌గౌడ్‌తో పాటు డైరెక్టర్ల చేత అసిస్టెంట్ రిజిస్ట్రార్ లక్ష్మణ్ ప్రమాణం చేయించారు. డైరెక్టర్లుగా భూమా భూపతిగౌడ్, మ్యాదరి లక్ష్మిగూల శివరాములు, బెస్త పోచవ్వ, భూమిని చిన్న దుర్గయ్య, మునిగేపల్లి సంగయ్య, జంబికుంట జీవయ్య, బోరంచ సుశీల, కోర్ర వజ్రనాయక్, లంబాడి తులూజా, కానాపురం నరసమ్మ, గడ్డం భాస్కర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని శ్రీధర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మాట్లమ్మెద సొసైటీ చైర్మన్ సురేందర్ గౌడ్, తహసీల్దార్ వెంకట్ రెడ్డి, సీఈవో చంద్ర మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



**ధర్మారం, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
కొలుముల దామోదర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, కెనడాలోని ఎన్నారై కొలుముల దామోదర్ యాదవ్ సౌజన్యంతో ఆయన కుమార్తె ధాత్రి పుట్టినరోజు సందర్భంగా మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 117 మంది విద్యార్థులకు బుధవారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ పోతు ప్రభాకర్ విద్యార్థులతో కేక్ కట్ చేయించి ధాత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కంటి అద్దాలు పంపిణీ చేస్తూ దామోదర్ యాదవ్ సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ, పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సుంచు మల్లేశం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గంధం మంగ మహిపాల్, వైస్ చైర్మన్ మెట్పల్లి తిరుమల నరేష్, కాంపల్లి తిరుపతి, నేరెళ్ల మహేష్, కోడిపెల్లి లచ్చయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముంపు గ్రామాలకు అండగా ప్రభుత్వం: మంత్రి అడ్లూరి





**ధర్మారం, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
నందిమేడారం రిజర్వాయర్ సామర్థ్యం పెంపుతో చామనపల్లి గ్రామంలో తలెత్తిన ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. బుధవారం గ్రామాన్ని సందర్శించిన మంత్రి ముంపు బాధితులు, గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ముంపు బాధితులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు. అధికారులతో సమన్వయం చేసుకుని బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు, ఉపసర్పంచ్ తీగుళ్ల కవిత సతీష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రూప్లా నాయక్, చింతల ప్రదీప్‌రెడ్డి, కొడారి హనుమయ్య, తహసీల్దార్ డి.శ్రీనివాస్, దాగేటి ఉదయ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జలమండలి అధికారులతో ఎమ్మెల్యే గాంధీ సమీక్ష



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 7 (తెలంగాణ వాణి విలేకరి)**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని తాగునీరు, డ్రైనేజీ సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై స్పందిస్తూ ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జలమండలి ఈడీ సంతోష్‌రెడ్డి, జీఎంలు కృష్ణ, హరిశంకర్, డీజీఎంలు నారాయణ, శ్రీనివాస్‌రాజు, నరేందర్, శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పోలీస్ ఉద్యోగ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి




**నల్గొండ, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులు జిల్లా పోలీస్ శాఖ అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను వారు పరిశీలించి, క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఉద్యోగం సాధించేలా యువతకు దిశానిర్దేశం చేశారు.

## రైతులు ఆయిల్‌ఫామ్ సాగు చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

**చిగురుమామిడి, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి విలేకరి):**
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే 'పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెకు ప్రజాపాలన' కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మండలంలోని ముదిమాణిక్యం, రామంచ, చిన్నముల్కనూర్, పీచుపల్లె, సీతారాంపూర్ గ్రామాల్లో పర్యటించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. త్వరలో గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని, కాలువల కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందిస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఆరుతడి పంటలతో పాటు ప్రతి గ్రామంలో రైతులు ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టి అధిక లాభాలు పొందాలని సూచించారు. గ్రామాల్లో శుభకార్యాలకు ప్లాస్టిక్ ప్లేట్లకు బదులు మహిళా సంఘాలకు అందించిన స్టీల్ ప్లేట్లను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ చిటుమల్ల రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అందె సురేష్, సాంబారి బాబు, పూదరి వేణుగౌడ్, గంజల రాములు, సర్పంచులు బోయినీ రమేష్, కిషన్‌రెడ్డి, భారతమ్మ కొమురయ్య, మాజీ ఎంపీటీసీ ముప్పిడి సంగీత దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మీడియా సెల్ ప్రతినిధి జిల్లాల రమేష్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.



## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

### -- సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉంటే వాటిని అరికట్టవచ్చని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ విభాగం రూపొందించిన 'ఆగండి.. ఆలోచించండి.. సరిచూసుకోండి' అవగాహన పోస్టర్‌ను బుధవారం పోలీస్ కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లోని అస్త్ర కన్వెన్షన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నకిలీ ఇన్‌వాయిస్‌లు, కొనుగోలు ఆర్డర్లతో జరిగే మోసాలను నివారించేందుకు చెల్లింపులకు ముందు విక్రేత, బ్యాంకు ఖాతా వివరాలను పరిశీలించాలని సూచించారు. ఇంటి నుంచే భారీగా సంపాదించవచ్చంటూ వచ్చే పార్ట్‌టైమ్ ఉద్యోగ ప్రకటనలను నమ్మవద్దని, గుర్తుతెలియని రుణ యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించారు. బ్యాంకు అధికారులు, పోలీసులమంటూ ఫోన్ చేసే వారికి ఓటీపీ, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత వివరాలు వెల్లడించవద్దన్నారు.




సోషల్ మీడియాలో వచ్చే అనుమానాస్పద లింకులను తెరవకూడదని, ముందస్తు చెల్లింపులు చేయవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సీపీ తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టౌన్ ఇన్‌స్పెక్టర్లు, సైబర్ విభాగం ఎస్సైలు అనూష, పోలీసు సిబ్బంది, ఎస్ఆర్ జూనియర్ ప్రైవేట్ కళాశాల జోనల్ ఇన్‌చార్జి తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మోదీ ప్రజాసేవకు కృతజ్ఞతగా సేవా జ్యోతి యాత్ర







**హుస్నాబాద్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ఆర్‌సీ):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవకు కృతజ్ఞతగా, వికసిత్ భారత్--2047 సాధన సంకల్పంతో నిర్వహిస్తున్న పీఎం సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో సేవా జ్యోతి యాత్ర నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పూలమాల వేసి బైక్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, అభియాన్ జిల్లా కన్వీనర్ ఖమ్మం వెంకటేశం, అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పైడిపల్లి పృథ్వీరాజ్, రాష్ట్ర నాయకులు లక్కిరెడ్డి తిరుమలరెడ్డి, తోట స్వరూప, మండల అధ్యక్షులు బుక్యా సంపత్‌నాయక్, రామంచ మహేందర్‌రెడ్డి, జాలిగం రమేష్, పోలోజు సంతోష్, దంచానల శ్రీనివాస్, మంతుర్తి శ్రీకాంత్, శ్రీరామోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

**డిండి, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గుండ్లపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై రైతు ఇడెమోని తిరుపతయ్యకు చెందిన పాడి గేదె మృతి చెందింది. పొలం వద్ద మేత మేస్తున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో విద్యుత్ షాక్ తగలడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సుమారు ఐదున్నరేళ్ల వయస్సున్న గేదె విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని గ్రామపంచాయతీ కార్యదర్శి ధ్రువీకరించారు. జీవనాధారమైన గేదెను కోల్పోయిన తమకు ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు నష్టపరిహారం అందించాలని రైతు కుటుంబం కోరింది.



## మృతి చెందిన మహిళకు ఎనిమిదేళ్లుగా పింఛన్!

**హుస్నాబాద్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ఆర్‌సీ):**
హుస్నాబాద్‌కు చెందిన వరయోగుల రామవ్వ 2018 డిసెంబర్ 13న మృతి చెందినప్పటికీ, ఆమె పేరుతో వికలాంగుల పింఛన్ ఇటీవల మే, జూన్ నెలల వరకు ఖాతాలో జమ అవుతోందని ఆమె పెద్ద మనవడు వరయోగుల వెంకటేశ్వర్లు స్వామి ఆరోపించారు. నెలకు రూ.4,016 చొప్పున వచ్చే పింఛన్‌ను మృతురాలి ఖాతా నుంచి ఏటీఎం లేదా ఫోన్‌పే ద్వారా ఎవరు తీసుకుంటున్నారో అధికారులు విచారణ చేయాలని కోరారు. మృతుల పేర్లపై కొనసాగుతున్న పింఛన్లపై సమగ్ర విచారణ జరిపి, అక్రమంగా తీసుకున్న నగదును రికవరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు









## శాంతిగూడెంలో కాంగ్రెస్ కమిటీల ఎన్నిక

**గుండ్లపల్లి, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డిండి మండలం శాంతిగూడెంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ, యూత్ కాంగ్రెస్, బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆదేశాల మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు ముత్యాల శశిధర్‌రెడ్డి సూచనలతో, గ్రామ సర్పంచ్ చింతలపూడి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే బాలు నాయక్ శాలువాలతో సన్మానించి అభినందించారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గణితి వెంకటేశ్వర్లు, యూత్ అధ్యక్షుడిగా కొట్టే మణికంఠ తదితరులు ఎన్నికయ్యారు. బూత్ కమిటీ సభ్యులుగా కోలా పిచ్చయ్య, సిహెచ్. మల్లారెడ్డి, జె. శేఖర్‌రెడ్డి, కొట్టే నాగేశ్వరరావు, కొవ్వూరి కొండల్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతలపూడి భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, నూతనంగా ఎన్నికైన గ్రామ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, బూత్ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాల బావి అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసశీ కార్యక్రమం





**డిండి అక్టోబర్ 7( తెలంగాణ వాణి ప్రతినిధి)**
డిండి మండలంలోని మాల బావి అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ రమణ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రమణ మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు చిన్నారులు పోషకాహార విలువలపై అవగాహన కల్పించారు. అంగన్వాడి కేంద్రంలో అందించే పోషక విలువలతో కూడిన ఆహారం అని తెలియజేశారు. ఈ ఆహారాన్ని గర్భిణీలు చిన్నారులు బాలింతలు అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రమణ, అంగన్వాడి టీచర్లు బి మంగ, ఎం పద్మావతి, వి. మంగ, జయమ్మ, ద్రౌపతమ్మ, వి. జయప్రద, డి. స్వరూప రాణి, గ్రామ ప్రజలు, బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధం

**ధర్మారం, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి):**
తనపై వచ్చిన అవినీతి ఆరోపణలను నిరూపిస్తే దేనికైనా సిద్ధమని నర్సింగాపూర్ సర్పంచ్ బంగుటపు కొమురయ్య సవాల్ విసిరారు. తనపై కావాలనే అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఆరోపణలు రుజువు చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు పాలకవర్గ సభ్యుల సంతకాలతోనే తీర్మానాలు జరిగాయని, ఐదు నెలల క్రితమే బిల్లులు పొందినట్లు తెలిపారు. తాను చేసిన అభివృద్ధిని ఓర్వలేక ఆరోపణలు చేయడం సరికాదని కొమురయ్య పేర్కొన్నారు.



## తహసిల్దార్ కార్యాలయంలో మట్టి వేలం

**శంకరపట్నం అక్టోబర్ 7 (తెలంగాణవాణి)**
కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల తహసిల్దార్ కార్యాలయంలో హుజురాబాద్ అడిషనల్, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఈరోజు మధ్యాహ్నం కార్యాలయ ఆవరణలో మూడు గంటలకు 18 ట్రాక్టర్ ట్రిప్పుల మట్టి వేలం నిర్వహించబడునని బుధవారం తహసిల్దారు కే. సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో



**జమ్మికుంట, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
హుజురాబాద్ ఆర్డీవో జలకుమారి బుధవారం జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం పట్టణ అభివృద్ధి పనులు, మున్సిపల్ సేవలు, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆర్డీవో చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, ఎంఆర్ఓ సుధాకర్, ఆర్ఐ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మద్దతు ధరకు పత్తి కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి



**నల్గొండ, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ మార్కెటింగ్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. 2026--27 ఖరీఫ్‌లో జిల్లాలో 5,93,795 ఎకరాల్లో పత్తి సాగు కాగా, 3,56,257 మెట్రిక్ టన్నుల పత్తి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని 26 జిన్నింగ్ మిల్లులతో పాటు సీసీఐ ఆధ్వర్యంలో 10 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.8,667 కాగా, 8 శాతం వరకు తేమ ఉంటే మద్దతు ధర లభిస్తుందని అధికారులు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

## పేకాట ఆడుతున్న నలుగురు అరెస్ట్




**హుస్నాబాద్, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి ఆర్‌సీ)**
: కోహెడ మండలం చెంచర్‌చెరువుపల్లి గ్రామ శివారులోని మాడెలయ్య గుడి సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని కోహెడ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,320 నగదు, పేకాట కార్డులు, రెండు వాహనాలు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అరెస్టయిన వారిలో సకినాల మల్లేశం (46), లెంకల రమణరెడ్డి (37), చీమలపాటి శ్రీకాంత్ (29), గౌరబోయిన మల్లయ్య (58) ఉన్నారు.

## చిన్నారుల ఆధార్ నమోదు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**పెద్దపల్లి, అక్టోబర్ 7 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
: ఐదేళ్లలోపు చిన్నారుల ఆధార్ నమోదు కోసం రామగుండం ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరం బుధవారం విజయవంతంగా నిర్వహించారు. అక్టోబర్ 8న కూడా శిబిరం కొనసాగనున్నందున అర్హులైన చిన్నారుల తల్లి దండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధార్ నమోదు చేయించుకోవాలని అధికారులు సూచించారు.



## ఒలింపిక్స్ 2036 ఆతిథ్యానికి

# గట్టిపోటీ..

### కీలక తేదీలు ప్రకటించిన ఐఓసీ..!



**న్యూఢిల్లీ:** పదహారేళ్ల తర్వాత జరగనున్న ఒలింపిక్స్ 2036కు ఆతిథ్యం కోసం నిరీక్షిస్తున్న భారత్‌కు గట్టి పోటీ ఎదురువుతోంది. విశ్వ క్రీడలను తమ ప్రాంతంలో జరిపేందుకు ఏకంగా ఏడు దేశాలు పోటీపడుతున్నాయని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ వెల్లడించింది. భారత్, జర్మనీ, హంగేరి, ఖతార్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, దక్షిణాఫ్రికా, తుర్కియే.. ఈ ఏడు విశ్వక్రీడల నిర్వహణ హక్కుల కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నాయని మంగళవారం ఐఓసీ పేర్కొంది.

భారత దేశంలో ఒలింపిక్స్ పోటీలు నిర్వహించాలని ప్రధాని నరేంద్ర మోడీ గట్టిగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. 2024లోనే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ భారత్ ప్రతిపాదన పెట్టింది. కానీ, కిర్‌స్టీ కొవెంట్రీ(జింబాబ్వే) ఐఓసీ అధ్యక్షురాలు అయ్యాక సమీక్షకు ఆదేశించింది. ఇప్పటికే 2028, 2031 వేదికలుగా లాస్ ఏంజెల్స్, బ్రిస్బేన్ ఖరారు కాగా.. 20236 ఎడిషన్ హక్కుల కోసం మన అధికారులు పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఐఓసీ కీలక ప్రకటన చేసింది.

విశ్వక్రీడల నిర్వహణ కోసం పోటీలో నిలిచిన ఏడు దేశాల పేర్లను వెల్లడించిన ఐఓసీ.. ఆతిథ్యాన్ని కట్టబెట్టేందుకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నవంబర్‌లోనే ఈ ఏడు దేశాల ప్రతినిధులు తమ ప్రాజెక్ట్‌ను ఐఓసీ ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ముందు సమర్పించాలని స్పష్టం చేసింది. తీవ్రమైన పోటీ దృష్ట్యా.. ఎవరి ప్రాజెక్ట్ బాగుంటే వారికే ఆమోదముద్ర వేయాలనుకుంటోంది ఒలింపిక్ కమిటీ.

**కీలక అంశాలివే..**

1. ఒలింపిక్స్ 2036 ఆతిథ్యం కోసం బిడ్డింగ్ వేసేందుకు తొలి తుది గడువును అక్టోబర్ 31గా నిర్ణయించింది ఐఓసీ. ఆసక్తిగల దేశాలు ఈ తేదీలోపే తమ ప్రతిపాదనను ఐఓసీకి పంపించాలి.

2. ప్రస్తుతానికి బరిలో ఉన్న ఏడు దేశాలతో చర్చలు జరుపుతోంది ఐఓసీ. నవంబర్‌లో ఈ దేశాల ప్రతినిధులు ఫ్యూచర్ హోస్ట్ కమిషన్ ముందు వర్చువల్‌గా ప్రజెంటేషన్ ఇవ్వాలని కోరింది.

3. నవంబర్ అనంతరం ఐఓసీ ఆసక్తిగల దేశాల దరఖాస్తులను పరిశీలించనుంది. వచ్చే ఏడాది మార్చిలో ఎగ్జిక్యూటివ్ బోర్డు వ్యూహాత్మక చర్చలు జరుపనుంది. ప్రాథమిక దశ పరిశీలన పూర్తయ్యాక.. బిడ్డింగ్ వేసిన దేశాల ప్రాజెక్టును సునిశితంగా గమనించనుంది ఐఓసీ.

4. 2028 డిసెంబర్‌లో ఒలింపిక్స్ అతిథ్యానికి అనువైన దేశాలతో ఐఓసీ చర్చించనుంది. 2029 మధ్యలో 2036 ఒలింపిక్స్ వేదికను ఐఓసీ సభ్యులు ఖరారు చేయనున్నారు.

## అగార్కర్ వారసుడిగా

# అతడే సమర్థుడు..

### మాజీ స్పిన్నర్‌కే చీఫ్ సెలెక్టర్ పగ్గాలు..!



**న్యూఢిల్లీ:** భారత పురుషుల సీనియర్ జట్టు ఛీఫ్ సెలెక్టర్ రేసు ఆసక్తి రేపుతోంది. ఈమధ్యే అజిత్ అగార్కర్ పదవీకాలం ముగియడంతో అతడి స్థానంలో ఎవరు? అనే ప్రశ్న తలెత్తింది. అయితే.. ఈ ప్రశ్నకు సమాధానం దాదాపు దొరికేసింది అనిపిస్తోంది. పలువురు మాజీ ఆటగాళ్లు పోటీలో ఉన్నప్పటికీ మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓఝా అందరికంటే ముందున్నాడు. ప్రస్తుతం సెలెక్షన్ కమిటీలో సభ్యుడైన ఓఝా తాత్కాలికంగా చీఫ్ సెలెక్టర్ బాధ్యతలు చేపట్టినా.. అతడు పూర్తి స్థాయిలో సేవలందించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఎందుకంటే.. అగార్కర్ వారసుడిగా అతడు సరైన, సమర్థుడైన వ్యక్తి అని బీసీసీఐ వర్గాలు భావిస్తున్నాయి.

స్వదేశంలో వెస్టిండీస్‌తో వన్డే, టీ20లకు స్క్వాడ్ ప్రకటన అనంతరం.. అజిత్ అగార్కర్ స్థానంలో కొత్త చీఫ్ సెలెక్టర్‌పై స్పష్టత వస్తుందని అంతా ఊహించారు. ముంబైలో జరిగిన 95వ బోర్డు వార్షిక సమావేశంలో అగార్కర్ గురించి ఓ నిర్ణయానికి రావాలని సభ్యులకు బీసీసీఐ సూచించింది కూడా. తన కాంట్రాక్ట్‌ను పొడిగించాలని అతడు సైతం బీసీసీఐని కోరలేదు. దాంతో.. తదుపరి చీఫ్ సెలెక్టర్ రేసులో మాజీ ఆటగాళ్లు పార్థీవ్ పటేల్, ప్రజ్ఞాన్ ఓఝాలు ఉన్నారనే వార్తలు వినిపించాయి.

అయితే.. ప్రస్తుతం సెలెక్షన్ కమిటీలో సభ్యుడైన ఓఝాకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించింది బీసీసీఐ. కొత్త చీఫ్ సెలెక్టర్ ఎంపిక పూర్తయ్యేంత వరకూ అతడు కొనసాగుతాడని భారత బోర్డు పేర్కొంది. కానీ, ఓఝా పూర్తి స్థాయిలో చీఫ్ సెలెక్టర్ పదవి చేపట్టే అవకాశాలున్నాయి. 'బీసీసీఐలో ఏదైనా జరగొచ్చు. చూస్తుంటే ఓఝాకు అందరూ అమోదం చెబుతారని అనిపిస్తోంది' అని మంగళవారం బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

# హర్మన్‌ప్రీత్ అధ్యాయం ముగిసె..

### మంధానకు కెప్టెన్సీ లాంఛనమే..!



**న్యూఢిల్లీ:** భారత మహిళల క్రికెట్‌లో ఓ అధ్యాయం ముగిసింది. టీమిండియా చిరకాల కలను సాకారం చేస్తూ వన్డే వరల్డ్‌కప్ అందించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథిగా వైదొలిగింది. ఆసియా క్రీడల్లో వరసగా రెండో స్వర్ణం గెలిచిన అనంతరం కెప్టెన్సీ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా వైదొలిగింది. పద్నాలుగేళ్లుగా నాయకిగా చెరగని ముద్ర వేసిన హర్మన్‌ప్రీత్ ఇకపై ప్లేయర్‌గానే కొనసాగనుండగా.. తదుపరి స్మృతి మంధానకు బాధ్యతలు అప్పగించడం లాంఛనమే అనిపిస్తోంది. ఇప్పటికే వైస్ కెప్టెన్‌గా కొనసాగుతున్న మంధానను త్వరలోనే పూర్తి స్థాయి కెప్టెన్‌గా బీసీసీఐ ప్రకటించనుందని సమాచారం.

దిగ్గజ క్రికెటర్లకు సాధ్యమవ్వని ఘనతలు, ఐసీసీ వన్డేవరల్డ్‌కప్ ట్రోఫీని కట్టబెట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీకి బైబై చెప్పేసింది. 2012లో టీ20లు, 2016లో వన్డేలో.. 2022లో టెస్టులు.. ఇలా మూడు ఫార్మాట్లకు నాయకత్వం వహించిన తను.. పద్నాలుగేళ్ల ప్రయాణంలో ఎన్నో విజయాలు సాధించింది. దూకుడైన ఆటతో, గెలుపే మంత్రగా చెలరేగిన హర్మన్‌ప్రీత్.. టీమిండియాను ఉన్నత శిఖరాలకు చేర్చింది. కోచ్ అన్మోల్ మజుందార్ సూచనలు, పటిష్టమైన స్క్వాడ్‌తో అద్భుతాలు చేసిన హర్మన్.. ఆసియా క్రీడల్లో స్వర్ణంతో మురిసింది.

ఐచీ నగోయ నుంచి తిరిగి వచ్చిన హర్మన్‌ప్రీత్ కౌర్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ మంగళవారం నా జాబ్ ముగిసింది అంటూ కెప్టెన్సీ వదులుకుంది. తను ఈ నిర్ణయం తీసుకోవడానికి దారి తీసిన పరిస్థితులను గమనిస్తే.. వయసు 37కు చేరడం.. స్మృతి మంధానకు కెప్టెన్సీ ఇవ్వాలని మాజీల డిమాండ్లు రావడం, తాను సారథ్యానికి సిద్ధమేనని మంధాన ప్రకటించడం వంటివి ఆమెను ప్రభావితం చేసి ఉంటాయి.

అందుకే కాబోలు.. మరో సిరీస్ కోసం వేచి చూడకుండా ఆసియా కప్, ఆసియా క్రీడల ఛాంపియన్‌గా సగర్వంగా నాయకత్వ బాధ్యతల నుంచి వైదొలిగింది హర్మన్. దాంతో.. ప్రస్తుతం వైస్ కెప్టెన్‌గా ఉన్న ఓపెనర్ స్మృతి మంధాన కెప్టెన్సీ కల నిజమవ్వనుంది. స్వదేశంలో జింబాబ్వేతో టీ20, వన్డే సిరీస్‌లో భారత జట్టు తలపడనుంది.




## బిజినెస్ Business

# దూసుకెళ్లిన స్టాక్ మార్కెట్..

**685 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్!**
**22,750 మార్కును దాటిన నిఫ్టీ**
**ఫార్మా, కెమికల్ షేర్లలో కొనుగోళ్లు**
**ఐటీ రంగంలో లాభాల స్వీకరణ**
**ఆర్‌బీఐ నిర్ణయంపై మార్కెట్ దృష్టి**
**కలిసొచ్చిన ముడి చమురు ధరల తగ్గుదల**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాలతో ముగిశాయి. రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధాన నిర్ణయం వెలువడనున్న నేపథ్యంలో పెట్టుబడిదారులు ఫార్మా, ప్రైవేట్ బ్యాంకింగ్, చమురు–గ్యాస్ షేర్లను కొనుగోలు చేశారు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా రెండో సెషన్‌లోనూ లాభపడ్డాయి.

సెన్సెక్స్ 685.34 పాయింట్లు పెరిగి 73,067.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 220.35 పాయింట్లు లాభపడి 22,776.10 వద్ద ముగిసింది. దీంతో నిఫ్టీ మరోసారి 22,750 మార్కును దాటింది.

నిఫ్టీ 22,800 స్థాయిని నిలబెట్టుకుంటే 23,000 మార్కు దిశగా వెళ్లే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దిగువన 22,600 వద్ద తక్షణ మద్దతు ఉందని, ఆ తర్వాత 22,500 కీలక స్థాయిగా ఉంటుందని తెలిపారు. అమ్మకాల ఒత్తిడి క్రమంగా తగ్గుతోందని చెప్పారు. ఆర్‌బీఐ ద్రవ్య విధాన నిర్ణయంపై మార్కెట్ వర్గాలు ప్రధానంగా దృష్టి పెట్టాయి. వడ్డీ రేట్లు, నగదు లభ్యత, ఆర్థిక పరిస్థితులపై కేంద్ర బ్యాంకు వైఖరి ఎలా ఉంటుందన్నదానిపై ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఉన్నారు. నిఫ్టీలో ట్రెంట్, బీఎస్ఈ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు భారీగా లాభపడ్డాయి. ఫార్మా, కెమికల్ షేర్లలో కొనుగోళ్లు ఎక్కువగా కనిపించాయి. నిఫ్టీ ఫార్మా సూచీ అత్యధికంగా లాభపడగా, కెమికల్ సూచీ తర్వాతి స్థానంలో నిలిచింది. విస్తృత మార్కెట్‌లోనూ కొనుగోళ్ల జోరు కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.08 శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్ సూచీ 1.56 శాతం లాభపడింది. మరోవైపు ఐటీ షేర్లలో కొంత లాభాల స్వీకరణ జరిగింది. దీంతో నిఫ్టీ ఐటీ సూచీ రోజులో అత్యధికంగా నష్టపోయిన రంగంగా నిలిచింది.

ముడి చమురు ధరలు తగ్గడం మార్కెట్‌కు కలిసొచ్చిందని నిపుణులు తెలిపారు. దేశీయ మార్కెట్లలో సానుకూల వాతావరణం ఉన్నా ప్రపంచ ఆర్థిక పరిస్థితుల ప్రభావం కొనసాగుతోందని పేర్కొన్నారు. సమీప కాలంలో మార్కెట్ ధోరణి సానుకూలంగానే ఉన్నా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు.

## జియో ఐపీఓ: రూ. 11 లక్షల కోట్ల

# వాల్యుయేషన్‌తో మార్కెట్లోకి...

**తేదీలు దాదాపు ఖరారు!**
**భారీ ఐపీఓకు సిద్ధమవుతున్న జియో ప్లాట్‌ఫామ్స్**
**సుమారు రూ. 11 లక్షల కోట్ల వాల్యుయేషన్ అంచనా**
**ఈ నెల 19న ఐపీఓ ప్రారంభమయ్యే అవకాశం**
**లిస్ట్ అయితే దేశంలో మూడో అతిపెద్ద కంపెనీగా జియో**
**నిధుల సమీకరణలో సరికొత్త రికార్డు సృష్టించే ఛాన్స్**




**న్యూఢిల్లీ:** రిలయన్స్ ఇండస్ట్రీస్ టెలికాం డిజిటల్ విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్, భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)లలో ఒకటిగా నిలిచేందుకు సిద్ధమవుతోంది. సుమారు రూ. 11 లక్షల కోట్ల (114 బిలియన్ డాలర్లు) భారీ వాల్యుయేషన్‌తో ఐపీఓకు వచ్చేందుకు కంపెనీ సన్నాహాలు చేస్తోంది. అంతా ప్రణాళికాబద్ధంగా జరిగితే, అక్టోబరు 19న ప్రారంభమయ్యే వారంలో ఐపీఓ ప్రక్రియ మొదలై, అక్టోబరు 30 నాటికి లిస్టింగ్ పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ వాల్యుయేషన్‌తో స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయితే, జియో ప్లాట్‌ఫామ్స్ దేశంలోనే మూడవ అతిపెద్ద లిస్టెడ్ కంపెనీగా అవతరిస్తుంది. ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ ఐపీఓ ద్వారా జియో సుమారు 3.4 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 28,000 కోట్లు) నిధులను సమీకరించే అవకాశం ఉంది. ఇదే గనుక జరిగితే, ఇటీవలే హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీఓ (2.9 బిలియన్ల డాలర్లు) నెలకొల్పిన రికార్డును జియో అధిగమించి, నిధుల సమీకరణలో దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా రికార్డు సృష్టిస్తుంది.

గతంలో జియో వాల్యుయేషన్‌పై 130 బిలియన్ల డాలర్ల నుంచి 170 బిలియన్ల డాలర్ల వరకు అంచనాలు వెలువడినప్పటికీ, ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా కంపెనీ వాస్తవిక అంచనాలతో ముందుకొస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లలో నెలకొన్న బలహీన సెంటిమెంట్ కారణంగా పలు ఐపీఓల ధరలపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో, జియో సైతం తన వాల్యుయేషన్‌ను సవరించుకున్నట్లు తెలుస్తోంది.

# దేశ ఆర్థిక వృద్ధిని 7.1 శాతంగా అంచనా వేసిన వరల్డ్ బ్యాంక్..!



**న్యూఢిల్లీ:** దేశ ఆర్థికవ్యవస్థ వృద్ధిపై ప్రపంచ బ్యాంకు సానుకూల అంచనాలను వెలువరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను భారత జీడీపీ వృద్ధిరేటు అంచనాను 7.1 శాతానికి పెంచుతున్నట్లు మంగళవారం ప్రకటించింది. గత ఏప్రిల్‌లో ఈ వృద్ధి అంచనా 6.6 శాతం ఉండగా.. తాజాగా దానిని 0.5 శాతం మేర సవరించింది. ఈ ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికంలో వృద్ధిరేటు అంచనాలను మించి 7.8 శాతంగ నమోదుకావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన తాజా 'ఇండియా డెవలప్‌మెంట్ అప్‌డేట్' నివేదికలో ప్రపంచ బ్యాంకు స్పష్టంచేసింది. గత ఆర్థిక సంవత్సరంలో బలమైన పెట్టుబడులు, స్థిరమైన ప్రైవేట్ వినియోగం కారణంగా వృద్ధిరేటు 7.8 శాతానికి చేరుకుందని ప్రపంచ బ్యాంకు పేర్కొన్నది. ఇదే ఒరవడి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ కొనసాగుతున్నదని, వృద్ధికి ప్రైవేట్ వినియోగమే ప్రధాన చోదకశక్తిగా నిలుస్తుందని విశ్లేషించింది. వీటికి తోడు అంచనాల కంటే మెరుగ్గా రాణిస్తున్న ఎగుమతులు కూడా ఆర్థికవృద్ధికి మరింత ఊతమిస్తాయని వివరించింది.

రంగాల వారీగా విశ్లేషిస్తే పారిశ్రామిక రంగం ముందస్తు అంచనాలను మించి రాణిస్తోందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. తొలి త్రైమాసికంలో విద్యుత్ రంగం 9.3 శాతం, మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాలు 7.2 శాతం వృద్ధిని సాధించాయి. అయితే నైరుతి రుతుపవనాల లోటు కారణంగా వ్యవసాయ రంగం పనితీరు కొంత బలహీనంగా ఉండే అవకాశం ఉందని నివేదిక హెచ్చరించింది.

ఆగస్టు వరకు వర్షపాతం తక్కువగా నమోదు కావడం గ్రామీణ డిమాండ్‌పై స్వల్ప ప్రభావాన్ని చూపవచ్చని అభిప్రాయపడింది. అంతర్జాతీయ అనిశ్చితుల దృష్ట్యా ప్రైవేట్ పెట్టుబడులపై ప్రభావం పడవచ్చని, ఫలితంగా ప్రభుత్వ వ్యయం కొంత మేర తగ్గే అవకాశం ఉందని నివేదిక పేర్కొన్నది. అయినప్పటికీ పటిష్ఠమైన ప్రభుత్వ పెట్టుబడులు, అనుకూల ఆర్థిక విధానాలు ఈ లోటును భర్తీ చేస్తాయని విశ్లేషించింది.

# 'ది ట్రైటర్స్' ట్రైలర్ విడుదల!



టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా హోస్ట్‌గా పరిచయమవుతున్న రియాలిటీ షో 'ది ట్రైటర్స్'. ఈ షో ట్రైలర్‌ను అమెజాన్ ప్రైమ్ వీడియో తాజాగా విడుదల చేసింది. రహస్య గుర్తింపులు, మారుతున్న విధేయతలు మరియు వ్యూహాత్మక అడుగుల నేపథ్యంలో సాగే ఈ క్రూరమైన గేమ్ షోపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ షోతో తేజ సజ్జా తొలిసారిగా రియాలిటీ షో హోస్ట్‌గా అడుగుపెడుతుండగా, మొత్తం 10 ఎపిసోడ్‌లతో తెరకెక్కిన ఈ సిరీస్ అక్టోబర్ 15 నుంచి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది.
ఈ షోలో భిన్నమైన నేపథ్యాల నుంచి వచ్చిన 20 మంది సెలబ్రిటీలు కంటెస్టెంట్లుగా బరిలోకి దిగుతున్నారు. ఇందులో సింగర్ చిన్మయి శ్రీపాద, నటులు హర్షవర్ధన్, ప్రగతి మహావది, శ్రీదేవి చౌదరి, నిఖిల్ విజయేంద్ర సింహ, విద్యుత్ రామన్, విష్ణు ఒయ్, శ్రావ్య వర్మ, డాక్టర్ మేఘనాథ్ రెడ్డి, మౌనీష చౌదరి, స్వీకర్ అగస్తి, ఆషిక పదుకొనే, వర్ష డిసౌజా, ప్రణవ్ అకా అభినవకవి, ఎస్ఎస్ వర్ధన్, రాహత్ అచంట, గౌరవ్ సునీల్, సాయి రోనక్, పుప్పాల ధనుంజయ్ మరియు ఫాల్గుణి బండేరా తదితరులు పోటీపడుతున్నారు. ఇందులో ఇన్నోసెంట్ (నిర్దోషులు) ప్లేయర్స్ అందరూ కలిసి తమలో ఉన్న 'ట్రైటర్స్' (మోసగాళ్లు) ఎవరనేది కనిపెట్టాల్సి ఉంటుంది. మరోవైపు ట్రైటర్స్ ఎవరికీ చిక్కకుండా రహస్యంగా ఆటను సాగించాలి. "మోసం ఇక్కడ న్యు రూల్" అంటూ సాగే ఈ హై-వోల్టేజ్ సర్వైవల్ గేమ్ ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్‌ను పంచడానికి సిద్ధమవుతోంది.

# షారుక్ 'కింగ్'లో కరీనా కపూర్..



బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'కింగ్' ఒకటి. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'వార్', 'పఠాన్' వంటి భారీ చిత్రాలను తెరకెక్కించిన సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో షారుక్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్ వెండితెరకు కథానాయికగా పరిచయం కానుండటం కూడా 'కింగ్'పై భారీ అంచనాలు నెలకొనేలా చేసింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన సమాచారం బాలీవుడ్ వర్గాల్లో వైరల్‌గా మారింది. ప్రముఖ నటి కరీనా కపూర్ 'కింగ్'లో ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. అంతేకాదు.. ఆమె కోసం ప్రత్యేకంగా ఓ పాటను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.
విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కరీనా కపూర్ 'కింగ్'లో ఓ ప్రత్యేక పాటలో మెరవనున్నారు. ఈ పాటను భారీ స్థాయిలో చిత్రీకరించేందుకు చిత్రబృందం ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోందట. ఈ నెలాఖరులో దక్షిణాఫ్రికాలో ఈ స్పెషల్ సాంగ్ షూటింగ్ జరగనున్నట్లు సమాచారం. షారుక్ ఖాన్, కరీనా కపూర్ కాంబినేషన్‌కు ఇప్పటికే బాలీవుడ్ ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉంది. గతంలో వీరిద్దరూ కలిసి పలు చిత్రాల్లో నటించి అలరించారు. ఇప్పుడు 'కింగ్'లో వీరిద్దరూ మరోసారి తెరపై కనిపించబోతున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ ప్రత్యేక పాటను సినిమాలోనే అతిపెద్ద ఆకర్షణల్లో ఒకటిగా నిలిచేలా భారీగా తెరకెక్కించాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. భారీ సెట్స్, గ్రాండ్ విజువల్స్‌తో పాటు స్టార్ పవర్‌ను కూడా ఉపయోగించుకుని ఈ పాటను రూపొందించనున్నట్లు తెలుస్తోంది.
ఇక షారుక్ ఖాన్ పుట్టినరోజు సందర్భంగా 'కింగ్' టీమ్ మరో సర్‌ప్రైజ్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. నవంబర్ 2న షారుక్ ఖాన్ జన్మదినం సందర్భంగా సినిమాకు సంబంధించిన కొత్త ప్రచార కంటెంట్‌ను విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే 'కింగ్'పై భారీ అంచనాలు ఉన్నాయి. షారుక్ ఖాన్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనుండగా.. సుహానా ఖాన్ కీలక పాత్రలో నటిస్తోంది. ఇప్పుడు కరీనా కపూర్ ప్రత్యేక పాటలో కనిపించనున్నారనే వార్త సినిమాకు మరింత స్టార్‌డమ్‌ను తీసుకొస్తోంది. 'కింగ్'లో షారుక్, సుహానాతో పాటు బాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. దీపికా పదుకొణె, అభిషేక్ బచ్చన్, రాణి ముఖర్జీ, అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్, జైదీప్ అహ్లావత్, అర్షద్ వార్సీ, రాఘవ్ జుయల్ తదితరులు ఈ సినిమాలో భాగమయ్యారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కింగ్' డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది

# కన్నడ యాక్షన్ ప్రిన్స్‌కు జోడీగా నభా నటేష్ ఫిక్స్..



**సరికొత్త లవ్‌స్టోరీకి రంగం సిద్ధం చేస్తున్న మేకర్స్**

టాలీవుడ్ టాలెంటెడ్ బ్యూటీ నభా నటేష్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్నారు. నిఖిల్ హీరోగా వస్తున్న భారీ పాన్-ఇండియా మూవీ 'స్వయంభు'లో నటిస్తూ ఫుల్ బిజీగా ఉన్న ఈ భామ, తాజాగా మరో గోల్డెన్ ఛాన్స్‌ను సొంతం చేసుకున్నారు. కన్నడ యాక్షన్ ప్రిన్స్ ధృవ్ సర్జా సరసన నభా నటేష్ హీరోయిన్‌గా సెలెక్ట్ అయ్యారు. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా వెల్లడిస్తూ సోషల్ మీడియాలో ఓ వీడియోను షేర్ చేసింది. పక్కా కమర్షియల్, గ్లామరస్ పాత్రలతో అలరించిన నభా నటేష్, ఇప్పుడు ఒక సరికొత్త లవ్ స్టోరీతో ప్రేక్షకులను పలకరించనున్నారు. ఈ సినిమాకు 'కెమిస్ట్రీ' అనే టైటిల్‌ను ఖరారు చేయగా.. 'కొంచెం ఆకర్షణ.. కొంచెం మాయ.. ఇంకా ఎన్నో' అనే క్యూట్ క్యాప్షన్ పెట్టారు. ఇక ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో నభా నటేష్, ధృవ్ సర్జా వర్షంలో తడుస్తూ ఒకరినొకరు హగ్ చేసుకున్న రొమాంటిక్ లుక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ కొత్త జోడీ లుక్ చూస్తుంటే సినిమాలో వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ పీక్స్‌లో ఉంటుందని అర్థమవుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై కృతి ప్రసాద్, టి.జి. విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యువ దర్శకుడు విశాల్ ఆత్రేయ ఈ సినిమాను చాలా డిఫరెంట్‌గా తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రంలో పవర్‌ఫుల్ హీరో పక్కన నభా నటిస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగిపోయాయి. సిల్వర్ స్క్రీన్ మీద ఈ ఫ్రెష్ జోడీ మ్యాజిక్ చూసేందుకు ఆడియన్స్ ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు.

# శ్రీవిష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్' ట్రైలర్ విడుదల..




టాలీవుడ్ హీరో శ్రీవిష్ణు నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. ఈ సినిమా మేకర్స్ అఫీషియల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. జానకిరామ్ మర్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రముఖ రచయిత, నిర్మాత కోన వెంకట్ సమర్పిస్తున్న ఈ సినిమాను కోన ఫిల్మ్ కార్పొరేషన్, స్కంద వాహన మోషన్ పిక్చర్స్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు.

1990ల కాలం నాటి ఆంధ్ర-ఒడిశా సరిహద్దు మాడుగుల గ్రామం నేపథ్యంలో సాగే ఈ కథ, పూర్తి స్థాయి పీరియాడికల్ యాక్షన్-కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోంది. శ్రీవిష్ణు తనదైన శైలిలో వినోదం పండిస్తూనే, సరికొత్త షేడ్స్‌లో ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తుండగా, ఇటీవల సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా ఖూ 16ం సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుంది. భారీ అంచనాల నడుమ ఈ చిత్రం అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# 'శతమానం భవతి' దర్శకుడి కొత్త సినిమా..

**అనిల్ రావిపూడి చేతుల మీదుగా 'సరిపోయారు ఇద్దరూ' టీజర్ లాంచ్.!**



'శతమానం భవతి' సినిమాతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ల దర్శకుడిగా జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న సతీష్ వేగేశ్న తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'సరిపోయారు ఇద్దరూ'. హ్యాపీ ఆక్స్ ఎంటర్టైన్మెంట్, ఎంఎస్ వారాహి క్రియేషన్స్, శతమానంభవతి ఆర్ట్స్ బ్యానర్లపై సాదత్, ముని శివ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మేఘాంశ్ శ్రీహరి, యశ్విన్ వేగేశ్న హీరోలుగా నటిస్తుండగా, రిద్ధి కుమార్, మేఘా చౌదరి హీరోయిన్లుగా కనిపించనున్నారు. అలాగే ప్రముఖ నటులు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, వి.కె. నరేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన టీజర్‌ను టాలీవుడ్ సక్సెస్ ఫుల్ డైరెక్టర్ 'హిట్ మెషిన్' అనిల్ రావిపూడి విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు.

టీజర్ విషయానికి వస్తే.. పల్లెటూరి వాతావరణం, వైజాగ్ సిటీ నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని తెలుస్తోంది. ప్రథమార్ధంలో ఒకరినొకరు అసహ్యించు కుంటూ, తీవ్రమైన ఘర్షణలతో పోట్లాడుకునే ఇద్దరు యువకుల పాత్రలతో టీజర్ ఆసక్తికరంగా మొదలవుతుంది. వారిద్దరి మధ్య ఉన్న వైరం కేవలం స్నేహం లేదా వ్యక్తిగత గొడవ మాత్రమే కాకుండా, వారి తండ్రులైన రాజేంద్ర ప్రసాద్, నరేష్‌ల మధ్య ఉన్న పాత కక్షలు, పరస్పర విద్వేషాలకు ముడిపడి ఉన్నట్లు టీజర్ ద్వారా అద్భుతంగా చూపించారు. యువ హీరోల మధ్య వచ్చే యాక్షన్ సన్నివేశాలతో పాటు, హీరోయిన్లతో సాగే లవ్ ట్రాక్స్ సినిమాకు సరికొత్త కలర్‌ఫుల్ అండ్ ఎంటర్‌టైనర్ డైమెన్షన్‌ను ఇస్తాయని స్పష్టమవుతోంది.

# నెల రోజుల్లో సూర్య 'సీన్'..




తమిళ స్టార్ హీరో సూర్య ఈ ఏడాది వరుస విజయాలతో జోరు మీదున్నారు. 'కరుప్పు', 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాలతో వరుసగా హిట్లు అందుకున్న ఆయన.. ఇప్పుడు ఈ ఏడాదిలో తన మూడో సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. జిత్తు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సీన్'పై ఇప్పటికే అంచనాలు ఉన్నాయి. అయితే సినిమా విడుదలకు సరిగ్గా నెల రోజుల సమయం మాత్రమే ఉండటంతో అభిమానుల్లో మరో రకమైన చర్చ మొదలైంది. 'సీన్' సినిమాను నవంబర్ 6, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. అంటే అక్టోబర్ 6 నుంచి లెక్కిస్తే సినిమాకు విడుదలకు సరిగ్గా నెల రోజుల సమయం మాత్రమే ఉంది. సాధారణంగా పెద్ద హీరోల సినిమాలకు విడుదలకు కొన్ని వారాల ముందే ప్రచార కార్యక్రమాలు ఊపందుకుంటాయి. అయితే 'సీన్' విషయంలో మాత్రం ఇప్పటివరకు ఆ స్థాయిలో ప్రచారం కనిపించడం లేదనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. సినిమాకు సంబంధించిన టైటిల్ టీజర్ ఇప్పటికే విడుదలైంది. అయితే దాని తర్వాత ఇప్పటివరకు పెద్దగా ప్రచార కార్యక్రమాలు జరగలేదు. ముఖ్యంగా పాటలు విడుదల కాకపోవడం, ఇతర ప్రచార కంటెంట్ కూడా ప్రేక్షకుల ముందుకు రాకపోవడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమా విడుదలకు నెల రోజులే మిగిలి ఉండటంతో ఇకపై ప్రమోషన్స్ ఎలా ఉండబోతున్నాయనే ప్రశ్నలు మొదలయ్యాయి.


Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com